హైదరాబాద్ వార్త





కేంద్ర బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న ఛత్రినాక ఏసీపీ చంద్రశేఖర్

## పాతబస్తీలో కేంద్ర బలగాల ఫ్లాగ్‌మార్చ్

**చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త :**

పాతబస్తీలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల్లో పోలీసులపై భరోసా పెంచేందుకు ఛత్రినాక డివిజన్ ఏసీపీ సిహెచ్.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. శాలిబండ ఇన్‌స్పెక్టర్ పి.మహేష్ గౌడ్, మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్ సి.శ్రీను, ఛత్రినాక డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ గోపాల్‌రావు, లా అండ్ ఆర్డర్ పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్‌ఎఎఫ్) బలగాలతో కలిసి శాలిబండ పోలీసుస్టేషన్ నుండి ప్రారంభమైన ఫ్లాగ్‌మార్చ్ మిశ్రీగంజ్, హిమ్మత్‌పురా, మొఘల్‌పురా, హరిబౌలి, గౌలిపురా, శ్రీరాంనగర్‌కాలనీ, మేకలమండి, పటేల్‌నగర్, సున్నితమైన ప్రాంతాల మీదుగా సాగింది. ఈ సందర్భంగా ఏసీపీ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రజలు వదంతులు నమ్మవద్దని, శాంతిభద్రల పరిరక్షణలో సహకరించాలని కోరారు. ప్రజల్లో ఉన్న అభద్రతా భావం తొలగించి మనోధైర్యం పెంచేందుకు ఫ్లాగ్‌మార్చ్ దోహద పడుతుందన్నారు. ఈ ఫ్లాగ్‌మార్చ్‌లో ఆయా పోలీస్‌స్టేషన్ల సబ్ ఇన్‌స్పెక్టర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జిహెచ్ఎంసిలో విలీనమైన మున్సిపల్ కార్పొరేషన్లలో

## దోమల జోరు..కనిపించని ఫాగింగ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 1,ప్రభాతవార్త**



ఫిబ్రవరి మొదటివారంలో చలిఉన్నా..దోమల జోరు తగ్గకపోవటం ప్రజలను విస్మయానికి గురిచేస్తోంది. నిరంతరం కాళ్లు ఆడిస్తూ ఉండటం.. చేతులతో గాలిని కొట్టుకోవటం వంటి దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఇంట్లో కూర్చున్నా, హాయిగా గాలి పీల్చుకుందామని బయటికి వచ్చినా దోమల భయంతో వెనక్కి పరుగులు తీయాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. శబ్దంతో పాటు కుట్టినప్పుడు వచ్చే దురదతో చికాకు, మానసిక అశాంతి పెరుగుతోందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో వాటి తాకిడి ఎక్కువగా ఉండటం సహజం. ఈ ఏడాది పరిస్థితి భిన్నంగా ఉంది. ప్రస్తుతమూ వాటి ఉధృతి తగ్గకపోగా మరింత పెరిగింది. పార్కులు, బహిరంగ ప్రదేశాలు, మురికి కాలువలు, మూసీ, ట్యాంక్‌బండ్, చెరువుకుంట పరిసరాల్లో ప్రకృతిని ఆస్వాదించడం కంటే దోమలతో యుద్ధం చేయటానికి ఎక్కువ సమయం కేటాయిస్తున్నామని పలువురు చెబుతున్నారు. మురుగు కాల్వల్లో అపరిశుభ్రత, పగటిపూట ఎండ, రాత్రిపూట చలివంటివి.. దోమల గుడ్లు పొదగడానికి అనుకూల వాతావరణాన్ని కలిస్తున్నాయి.

మురుగుకాల్వల్లో పూడిక తీయకపోవటం వల్ల నీటి నిల్వలతో క్యూలెక్స్ వంటి దోమలు విజృంభిస్తున్నాయి. దోమల రకాన్ని బట్టి అవి కుట్టే సమయాలు మారుతుంటాయి. డెంగీ కారకఈడిస్ ఈజిప్టి దోమలు సూర్యోదయానికి, సూర్యాస్తమయానికి ముందు కుడతాయి. క్యూలెక్స్, అనాఫిలిస్ దోమలు చీకటి పడినప్పటి నుంచి రాత్రంతా చురుగ్గా ఉంటాయి.

జిహెచ్ఎంసి పరిధిలో గతంలాగా ఫాగింగ్ కనిపించడంలేదు. జిహెచ్ఎంసిలో విలీనమైన బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేటర్ పరిధిలో అపరిశుభ్రత ఘోరంగా ఉంది. కిరణ్ ఇంటర్నేషనల్ స్కూల్ ఎదురువీధి, కేశవ్‌నగర్ కాలనీలో దోమలు విజృంభిస్తున్నా పట్టించుకునేవారు లేకుండా పోయారు. అలాగే జిహెచ్ఎంసిలో విలీనమైన మున్సిపాలిటీల పరిస్థితి అలాగే ఉంది.దోమల నివారణపై శ్రద్ధ చూపటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మురుగు కాల్వల్లో నీరు నిలవకుండా పూడిక తీయించాలి. క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయాలి. నీటి నిల్వలు ఉన్నచోట దోమల గుడ్లను నిర్మూలించే మందులను చల్లాలి. క్షేత్రస్థాయిలో ఇవేమీ కొనసాగటం లేదని జనం గగ్గోలు పెడుతున్నారు.

## మెట్రో రెండో దశ..నిరాశ!

### హైదరాబాద్‌కు మూడు హై స్పీడ్ రైల్ కారిడార్లు

**హైదరాబాద్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :**

పార్లమెంటులో ఆదివారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నగరానికి ప్రాధాన్యం కాసింతే దక్కింది. హైదరాబాద్ మెట్రోరైల్ రెండోదశపై కేంద్రం ఊరించి ఉస్సూరుమనిపించింది. మెట్రోపై ఎలాంటి ప్రస్తావన లేకపోవడం అన్నివర్గాలను తీవ్ర నిరాశకు గురిచేసింది. మూసీ త్రిపుల్ ఆర్ ఊసే లేదు. బల్దియా పరిధిలో అభివృద్ధి పథకాలకు ఆసరా కలిగించేలా భావించినప్పటికీ నిర్మలమ్మ ఆ దిశగా కరుణ చూపించలేకపోయారు. జిహెచ్ఎంసి, జలమండలి, జాతీయ నిధి పరిరక్షణ ప్రణాళికలో మూసీ నది భాగస్వామ్యం, ఎంఎంటిఎస్, హెచ్ఎండిఎ ఇలా వివిధ విభాగాల్లో నిధుల వరద పెద్దగా కనిపించకపోవడం గమనార్హం.

కాగా, హైదరాబాద్‌ను అనుసంధానిస్తూ పలు హైస్పీడ్ రైలు కారిడార్లను కేంద్రం ప్రకటించింది. మంత్రి నిర్మలాసీతారామన్ దేశవ్యాప్తంగా మొత్తం ఏడు హైస్పీడ్ కారిడార్లు ప్రకటించగా, వాటిలో హైదరాబాద్-పుణె, హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్-బెంగళూరు కారిడార్లు హైదరాబాద్ నుంచి ఉండటం విశేషం. ఈ హైస్పీడ్ రైలు ప్రాజెక్టులతో దేశంలోని ప్రధాననగరాల మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గే అవకాశముంది. ముఖ్యంగా హైదరాబాద్ దేశవ్యాప్తంగా కీలక రవాణా కేంద్రంగా మరింత బలోపేతం కానుంది. ఐటీ కంపెనీలకు పన్ను మినహాయింపులు ఈ బడ్జెట్‌లో పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. హైదరాబాద్ ఐటీరంగానికి ఇది చాలా మేలు చేయనుందని తెలుస్తోంది. అలాగే క్లౌడ్ డేటా సెంటర్లకు పన్ను ఉండదు. ఇక ఫార్మా కంపెనీల కోసం బయోఫార్మా శక్తి అనే స్కీం తెచ్చారు. ఇది నగర శివారు ప్రాంతాల్లోని ఫార్మకంపెనీలకు ఉపయోగపడనుంది.చార్మినార్, గోల్కొండలాంటి చారిత్రక ప్రదేశాలను మరింత అభివృద్ధి చేయ నున్నారు. ఇందుకోసం టూరిస్ట్‌గైడ్లకు ట్రైనింగ్ ఇవ్వనున్నట్లు బడ్జెట్‌లో తెలిపారు. ప్రభుత్వం మౌలిక వసతులు, తయారీ రంగానికి పెద్ద పీట వేసింది. అదే సమయంలో కొన్ని వస్తువులు చౌక య్యేలా, మరికొన్ని ఖరీదయ్యేలా నిర్ణయాలు తీసుకుంది.

**కంటెంట్ క్రియేటర్ ల్యాబ్‌లతో యువతకు నైపుణ్యాభివృద్ధి : స్వాతి, అసిస్టెంట్ ప్రొఫెసర్**

**గచ్చిబౌలి, జనవరి 27 ప్రభాతవార్త**



ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రకటించిన విధంగా కంటెంట్ క్రియేటర్లను ప్రోత్సహించేందుకు ఆరెంజ్ ఎకానమీ లక్ష్యంగా చర్యలు చేపట్టే ప్రకటన బడ్జెట్‌లో వెల్లడించడం సంతోషకరం. ఉపాధి అవకాశాలకు సరిపోయే నైపుణ్యాన్ని యువతకు సిద్ధం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రక టించారు. చదువు పూర్తి చేసుకొని ఉద్యోగ అన్వే షణలో ఉన్న యువతకు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా తయారు చేసేందుకు దేశ వ్యాప్తం గా కంటెంట్ క్రియేటర్ ల్యాబ్‌లు ఏరా ్పటు చేస్తున్నట్లు ప్రకటించడంతో యానిమేషన్, గేమింగ్, కామిక్స్, డిజైన్ రంగాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. విదేశాలకు వెళ్లే విద్యార్థులకు టీసిఎస్ తగ్గింపు, దేశ వ్యాప్తంగా 15 వేల పాఠశాలలు, 500 కాలేజీల్లో ఏవీజీసి కంటెంట్ క్రియేటర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించడం సంతోషకరమన్నారు.

**ట్యాక్స్ హాలిడేతో కొత్త కంపెనీలకు అవకాశం**

**బండారి నరేష్‌రెడ్డి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి**



దేశంలో డేటా సెంటర్లు ఏర్పాటు చేసే విదేశీ కంపెనీలకు 2047 వరకు ట్యాక్స్ హాలిడే ప్రకటిస్తూ బడ్జెట్‌లో నిర్ణయం తీసుకోవడం కొత్త కంపెనీల ఏర్పాటుకు అవకాశం కల్పిస్తుంది. దీని కారణంగా విదేశీ కంపెనీలు దేశంలో తమ కార్యాలయాలు ప్రారంభించి, కొత్తగా ఉద్యోగ అవకాశాలు స ృష్టించే అవకాశం ఉంటుంది. హైదరాబాద్ నగరానికి హైస్పీడ్ రైల్ కనెక్టివిటీతో రవాణా వ్యవస్థ మెరుగవుతుంది. రైతులకు ప్రోత్సా హకాలు కల్పించే ప్రకటన లేకపోవడం కొంత నిరుత్సాహానికి గురిచేసింది. కొత్తగా 5 యూనివర్సిటీ టౌన్‌షిప్‌ల ఏర్పాటు ప్రకటన, విదేశీ విద్యతో పాటు వైద్య అవసరాల కోసం పంపే నిధులపై 2శాతానికి టీసిఎస్ తగ్గింపు విద్యార్థులకు ఉపయోగకరం. కేంద్ర బడ్జెట్ వెలువడిన అనంతరం ఆర్థిక నిపుణులు తమ అభిప్రాయాలను మీడియాతో పంచుకున్నారు.

**చిన్న సూక్ష్మరంగ పరిశ్రమలకు ప్రాధాన్యత**

**డా. మోహన్‌రావు**

**తార్నాక, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :**



చిన్న సూక్ష్మరంగ పరిశ్రమలు నేడు అనేక ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నాయి. ఈ క్రమంలో ఉద్యోగ కల్పన కోసం రూ. ఎంఎస్ఎఈలను ఆదుకోవడం కోసం బడ్జెట్‌లో రూ. 10 వేల కోట్లలో గ్రోత్ ఫండ్‌ను ప్రతిపాదించడమేగాక క్రెడిట్ గ్యారంటీ కింద వారికి ఆర్థిక సహాయం అందించడం మంచి పరిణామమని సామాజిక వేత్త డా. మోహన్ రావు పేర్కొన్నారు. ఈ బడ్జెట్లో 2 వేల కోట్లు ప్రతిపాదించడం శుభపరిణామం. విద్యా సంస్థలను పరిశ్రమలతో అనుసందానం చేయడం, కేంద్ర ప్రభుత్వం కొన్ని జిల్లాలలో మహిళల కోసం వాస్టల్లను ఏర్పాటు చేమాలని ప్రతిపాదించడం మంచి ప్రతిపాదన. మన రాష్ట్రానికి హైస్పీడ్ రైళ్ల ప్రతివాదన తీసుకురావడం మంచి విషయం. ఆదాయం పన్నుల విషయంలో,స్టాండర్డ్ డిడెక్షన్ విషయంలో మార్పు చేయకపోవడు వేతన జీవులకు నిరాష మిగిల్చింది.



**వికసిత్ భారత్ దిశగా 2026 బడ్జెట్**

**డా. గాలి వినోద్‌కుమార్**

**తార్నాక, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :**



2026 కేంద్ర బడ్జెట్ వికసిత్ భారత్ లక్ష్యంగా కీలక అడుగులు వేసిందని ప్రొ. గాలి వినోద్ కుమార్ అభిప్రాయపడ్డారు. వ్యవసాయానికి భారీగా నిధులు కేటాయిస్తూ డిజిటల్ అగ్రికల్చర్, ఏఐ టెక్నాలజీ వినియోగానికి ప్రాధాన్యత ఇచ్చింది. వైద్య, విద్య, స్కిల్ డెవలప్‌మెంట్, స్టార్టప్-ఎంఎస్ఎంఈ, మహిళా సాధికారత, ఫార్మా-బయోటెక్ రంగాలకు ప్రోత్సా హం ఇచ్చిన ఈ బడ్జెట్ ఎన్నికల బడ్జెట్ కంటే ప్రజల బడ్జెట్‌గా నిలుస్తుంది.

**యువత, మధ్యతరగతి ఆశలకు అనుగుణంగా బడ్జెట్**

**డా.ఆత్మీయ నిర్మల**



యువతకు, రేపటి తరానికి ప్రోత్సా హాన్ని కలిగించేలా కేంద్ర బడ్జెట్ రూపొందించబడిందని డాక్టర్ ఆత్మీయ నిర్మల పేర్కొన్నారు. యువతలోని నైపుణ్యాలను వెలికి తీసే కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం అభినందన్నీయం,సాఫ్ట్‌వేర్ రంగాన్ని ప్రోత్స హిస్తూ, విద్యా-వైద్య రంగాలను సమతుల్యంగా అభివృద్ధి చేసే విధంగా బడ్జెట్ కేటాయింపులు ఉండటం మధ్యతరగతి వర్గాలకు అనుకూలంగా ఉంది. అందుబాటులో ఉన్న వనరులతోనే అన్ని వర్గాలకు ఆమోదయోగ్యంగా రూపొందించిన బడ్జెట్‌గా వారు విశ్లేషించారు.

## సంత్ గురు రవిదాస్ బోధనలు సర్వమానవాళికి ఆదర్శం

### హర్యాన పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ప్రభాతవార్త)

సంత్ గురు రవిదాస్ బోధనలు సర్వమానవాళికి ఆదర్శంగా నిలుస్తాయని హర్యాన పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. ఆదివారం రాంనగర్‌లో ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, సామాజిక సంస్కర్త సంత్ గురు రవిదాస్ జీ జయంతిసభ జరిగింది. ముఖ్యఅతిథిగా బండారు దత్తాత్రేయ హాజరై ఆ మహనీయుడి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి ప్రసంగించారు. గురు రవిదాస్ జీ తన బోధనల ద్వారా సమాజానికి సమానత్వం, సామాజిక న్యాయం మరియు ప్రేమ అనే సందేశాలను అందించారని కొనియాడారు. కులమతాల ప్రాతిపదికన జరిగే వివక్షను రూపుమాపడానికి ఆయన తన జీవితాంతం అలుపెరగని కృషి చేశారని తెలిపారు. సరళత, నైతిక క్రమశిక్షణతో కూడిన మార్గంలో నడుస్తూ, మానవత్వమే పరమావధిగా ఆయన జీవించారని గుర్తుచేశారు. గురు రవిదాస్ జీ ఆలోచనలు ఎప్పటికీ సముచితమైనవని, మానవీయ విలువలను పెంపొందించుకోవడంలో అవి మనకు నిరంతరం దిశానిర్దేశం చేస్తూనే ఉంటాయని ఆయన పేర్కొన్నారు. దేశ యువత గురు రవిదాస్ బోధనలను తమ జీవితాల్లో అన్వయించుకోవాలని, తద్వారా దేశ నిర్మాణంలో క్రియాశీలక పాత్ర పోషించాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కాంతి కిరణ్ , మహంకాళి సికింద్రాబాద్ జిల్లా బిజెవైఎం అధ్యక్షుడు మద్దూరి శివాజీ, దీపక్ కుమార్ మాల ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## అంబటి రాంబాబు దిష్టిబొమ్మ దగ్ధం

**హైదరాబాద్, ఫిబ్రవరి 1(ప్రభాతవార్త) :**

ఏపీ సీఎం చంద్రబాబుపై అంబటి రాంబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం అశోక్‌నగర్ చౌరస్తా వద్ద సికింద్రాబాద్ పార్లమెంటు టిడిపి నాయకులు నల్లెల కిషోర్, పి. బాలరాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో అంబటి రాంబాబు దిష్టిబొమ్మను చెప్పులతో కొడుతూ, నిప్పు పెట్టి తమ నిరసనను వ్యక్తం చేశారు.చంద్రబాబు నాయుడుపై అంబటి రాంబాబు చేసిన అహంకారపూరిత, అసభ్యకర వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు వంటిదని నేతలు తీవ్రంగా విమర్శించారు. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడకం ద్వారా సుమారు 250 కోట్లకు పైగా కుంభకోణం జరిగిందని, ఈ అంశం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే అంబటి రాంబాబు ఖిడైవర్షన్ పాలిటిక్స్ఖి కు పాల్పడుతున్నారని టిడిపి నేతలు విమర్శించారు. పవిత్రమైన శ్రీవారి ప్రసాదం తయారీలో ఆవు నెయ్యి బదులు 68 లక్షల కేజీల కల్తీ కెమికల్ నెయ్యి వాడారని, ఇందులో 36 మంది భాగస్వామ్యమున్నట్లు సిట్ రిపోర్ట్ స్పష్టం చేసినా, ఎదురుదాడి చేయడం సిగ్గుచేటని వారు మండిపడ్డారు. ఒక నిబద్ధత కలిగిన నాయకుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబును విమర్శించడం అంటే రాష్ట్ర ప్రజలందరినీ అవమానించడమేనని నేతలు ధ్వజమెత్తారు.ముఖ్యమంత్రిపై చేసిన వ్యాఖ్యలను సుమోటోగా స్వీకరించి, పోలీసులు ఆయనను అరెస్ట్ చేయాలని, న్యాయస్థానం కఠినంగా శిక్షిొంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పరశురామ్, ఓ వెంకటేష్, రాజేంద్ర ప్రసాద్, భాను ప్రకాష్, కరణం కిరణ్, శ్యామ్ సుందర్, తడక వినోద్, అనిల్ కురుమ, వంశీ కృష్ణ, చంద్రమోహన్ గౌడ్, ఎస్.ప్రకాష్, కొమురయ్య, భవానీ శ్రీనివాస్, పి.వీరబాబు, అమ్మి నాయుడు, భిక్షపతి చారి, సత్యనారాయణ, అహ్మద్ అలీ, శక్తి ప్రేమ్, రవి గౌడ్ పాటు సికింద్రాబాద్ నియోజకవర్గ టిడిపి శ్రేణులు ఇతర ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో



అంబటి రాంబాబు దిష్టిబొమ్మను దగ్ధం చేసిన దృశ్యం



## అలియాబాద్ సుల్తాన్‌బాగ్‌లో పేలిన గ్యాస్ సిలండర్

**చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త :** ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలి వంటిళ్లు ధ్వంసమైన సంఘటన ఛత్రనాక పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ ప్రేమ్‌కుమార్ కథనం ప్రకారం... అలియాబాద్ సుల్తాన్‌బాగ్‌లో లక్ష్మయ్య(66) భార్యతో కలిసి నివసిస్తున్నాడు. ముందు గదిలో వారు నిద్రించారు. దానికి ఆనుకొని రేకులు షెడ్లో వంటిళ్లు ఉంది. తెల్లవారు జామున నాలుగున్నర గంటల ప్రాంతంలో శబ్దం వచ్చింది. వెళ్లి చూడగా గ్యాస్ సిలిండర్ పేలి మంటలంటుకున్నాయి. పేలుడు ధాటికి షెడ్ రేకులు ఎగిరిపోగ, గోడలు బీటలు వారాయి. ఇంట్లోని వంట సామాగ్రి చెల్లా చెదురైయింది. వస్తువులు కాలిపోయాయి. అయితే భార్యభర్తలకు ఎటువంటి గాయాలు కాలేదు. విషయం తెలుసుకున్న ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ కె.ఎన్.ప్రసాద్ వర్మ సంఘటనా స్థలానికి చేరుకొని అగ్నిమాపక సిబ్బంది సహాయంతో మంటలను అదుపు చేశారు. సిలిండర్ పేలుడుకు గల కారణాలు తెలియరాలేదు. పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా భరతముని ఆరాధనోత్సవాలు

**చిక్కడపల్లి ఫిబ్రవరి 1 (ప్రభాతవార్త ) :** భారతీయ సంస్కృతిక సంగీత నాట్యశాస్త్ర పితామహులు భరతముని ఆరాధనోత్స వాలు ఆదివారం ఘనంగా జరిగాయి. దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతులు అవధూతగిరి సిద్దేశ్వరా నందగిరి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. చిన్నారులు, కళాకారులు భారతీయ శాస్త్రీయ నృత్యం, సంగీత కళలను ప్రదర్శించారు. శ్రీసాయి శ్రుతి మ్యూజిక్ అకాడమీ సంస్థ విద్యార్థులతో కలిసి అరుదైన అపురూపమైన అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. సంస్థ వ్యవస్థాపకులు గౌరీభట్ల లక్ష్మణమూర్తి కి వసుధ లకు “భరతముని గౌరవ్ సమ్మాన్ పురస్కార్2025“ అనే అపురూపమైన గౌరవం దక్కింది.

## అంతా హైటెన్షన్.. పోలీసుల అటెన్షన్

### నగర వ్యాప్తంగా బిఆర్‌ఎస్ శ్రేణుల ఆందోళనలు, ర్యాలీలు.. సిఎం దిష్టిబొమ్మలు దగ్ధం

### తెలంగాణ భవన్, మంత్రుల ప్రాంగణ సముదాయం వద్ద ఉద్రిక్తత

**జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త**

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సిట్ విచారణ నేపథ్యంలో నగరంలో ఒక్కసారిగా రాజకీయం వేడెక్కింది. బంజారాహిల్స్ నందినగర్‌లోని కేసీఆర్ నివాసంలో ఆదివారం మధ్యాహ్నం సిట్ విచారణ నేపథ్యంలో నగరంలోని అన్ని నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పార్టీ ఆందోళనలకు దిగింది. ఈ నేపథ్యంలో పోలీసు శాఖ ముందస్తుగానే అప్రమత్తమైంది. శనివారం రాత్రి నుంచే బీఆర్ఎస్ ముఖ్యనేతల కదలికలపై దృష్టి సారించింది. ఆందోళనకు పాల్పడే నాయకులను గృహనిర్బంధం చేసింది. మరోవైపు బీఆర్ఎస్ నేతలు ర్యాలీలు, ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు, సీఎం దిష్టిబొమ్మ దగ్ధం కార్యక్రమాలను ఎక్కడికక్కడ ఆయా నియోజకవర్గాల్లో చేపట్టారు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్, సైబారాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్‌సిటీ కమిషనరేట్ల పరిధిలో బీఆర్ఎస్ నేతలను ఎక్కడికక్కడే కట్టడి చేశారు. ముఖ్యనేతలను గృహనిర్బందం చేశారు. నగరంలోకి రాకుండా నలువైపులా అడ్డుకున్నారు. తెలంగాణ భవన్ వద్దకు చేరుకున్న బీఆర్ఎస్ శ్రేణులు ఇక్కడ పెద్దఎత్తున ఆందోళనను నిర్వహించాయి. ఈ సందర్భంగా పోలీసులకు, బీఆర్ఎస్ నేతలకు మధ్య జరిగిన తోపులాటతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సీఎం డౌన్‌డౌన్ అంటూ శ్రేణులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రైతన్న సురేష్‌యాదవ్ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మకు బిఆర్ఎస్ కార్యకర్తలు ఉరివేశారు. తెలంగాణ భవన్‌కు సీఎం దిష్టిబొమ్మను వేలాడితీసి అనంతరం దగ్ధంచేశారు. ఇక నందినగర్‌లోని నివాసం వద్దకు బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్దఎత్తున చేరుకున్నారు. అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకొనేందుకు యత్నించడంతో తోపులాట జరిగింది. ఈ తోపులాటలో ఒక మహిళ కిందపడిపోయింది.

**నగర వ్యాప్తంగా ఆందోళనలు**

బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నగర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఆందోళనలు నిర్వహించారు. సెక్రటేరియేట్ ముందు మాజీ వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ మసియుల్లా ఖాన్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఇబ్రహింపట్నం నియోజకవర్గంలో మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మ దగ్ధంతోపాటు బైకు ర్యాలీ, ఆందోళనలు నిర్వహించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం యూసుఫ్‌గూడ బస్తీవద్ద కార్పొరేటర్ దేదీప్యరావు ఆధ్వర్యంలో, శేరిలింగంపల్లిలో నరేందర్‌యాదవ్ ఆధ్వర్యంలో, మలక్‌పేట, వనస్థలిపురంలో సీఎం దిష్టిబొమ్మను దగ్ధంచేశారు. మన్నె క్రిశాంక్ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ నియోజకవర్గంలో భారీ ర్యాలీ నిర్వహించాయి. నల్లజెండాలతో తమ నిరసనను వ్యక్తం చేశారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో మంత్రుల ప్రాంగణ సముదాయ ముట్టడికి యత్నించాయి.

పోలీసులు వారిని అడ్డుకోవడంతో ఇక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. గెల్లుతోపాటు నేతలు కడారి స్వామియాదవ్, తంగా బాలు, చాటారీ దశరథ్, నర్సింగ్, యశ్వంత్, నాగేందర్ రావు, నర్సింగ్ తదితరులను అరెస్ట్ చేశారు. బీఆర్ఎస్ శ్రేణులు తెలంగాణ భవన్ నుంచి జూబ్లీ హిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసానికి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు తెలంగాణ భవన్ గేట్లను మూసేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులకు,బీఆర్ఎస్ నాయకులకు, కార్యకర్తలకు మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

**భారీ బందోబస్తు**

కేసీఆర్ సిట్ విచారణ నేపథ్యంలో పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు. ప్రధానంగా నగరమంతా హైఅలెర్ట్‌గా ఉంచడంతోపాటు నందినగర్‌లోని కేసీఆర్ నివాసంవద్దకు రాకుండా దారులన్నింటిని పోలీసులు తమ స్వాధీనంలోకి తీసుకొచ్చుకున్నారు. అన్ని దారుల్లో బారికేడ్లను ఏర్పాటు చేశారు. అలాగే బంజారాహిల్స్ క్యాన్సర్ ఆసుపత్రి దారి ఇతర దారులలో ఆదివారం ప్రయాణించవద్దని ట్రాఫిక్ పోలీసు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. వందలాది మంది పోలీసులను నందినగర్‌లోని నివాసం వద్ద, తెలంగాణ భవన్ వద్ద ఏర్పాటుచేశారు. కేసీఆర్‌ను చూడటానికి వివిధ ప్రాంతాలనుంచి అభిమానులు వచ్చినప్పటికి పోలీసులు వారిని అనుమతించలేదు. అక్కడి నుంచి తిప్పి పంపారు. వివిధప్రాంతాల నుంచి బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు ఇక్కడికి చేరుకున్నప్పటికి పోలీసులు వారిని అనుమతించలేదు. కేసీఆర్ వద్దకు వచ్చిన మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 160 సీఆర్‌పీసీని పోలీసులు తుంగలో తొక్కారన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓటమి భయంతోనే కాంగ్రెస్ పార్టీ ఈ డ్రామాలు ఆడుతుందన్నారు. ఎన్ని కుట్రలు చేసినా ప్రజల పక్షాన తమ పోరాటం ఆగదన్నారు. తెలంగాణ భవన్ వద్ద మాజీ స్పీకర్ మధుసూదనాచారి, కర్నె ప్రభాకర్‌లు ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. కేసులో పసలేకున్నా ధారావాహికలా నడిపిస్తున్నారని అన్నారు. తెలంగాణ సమాజం గొప్పగా ఆరాధించే నేతను అవమానపర్చడం అభ్యంతరకరమన్నారు.







సిఎం దిష్టిబొమ్మ దగ్ధం, నందినగర్‌లో బారికేడ్లు ఏర్పాటుచేసి పోలీసుల బందోబస్తు, కెసిఆర్ నివాసం ముందు సిట్ అధికారుల వాహనాలు

## క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించాలి

### హైడ్రా కమిషనర్ రంగనాథ్

**యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త**

క్యాన్సర్ మహమ్మారిని తరిమేయడానికి ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా తగిన జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. ఆదివారం నందమూరి బాలకృష్ణ అభిమాన వెల్ఫేర్ అసోసియేషన్ జంగా శ్రీధర్, నూకవరపు వేణు, జగదీష్, దొరబాబు, పరిటాల రాంబాబు, శరత్,జగదీష్ మహేష్ ఆధ్వర్యంలో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ రీసెర్చ్ సహకారంతో మోతీనగర్ మ్యూనిటీ హాల్‌లో క్యాన్సర్ అవగాహన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా హైడ్రా కమిషనర్ రంగనాథ్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇంచార్జ్ బండి రమేష్, అన్విత గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ నాగభూషణం, గరికపాటి శ్రీనివాస్, బాలల హక్కుల సంరక్షణ చైర్‌పర్సన్ సీతా దాయకర్, కిలారి మనోహర్‌లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఊహించిన దానికంటే ఎక్కువ మంది మహిళలు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరానికి వచ్చి అన్ని పరీక్షలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ మాట్లాడుతూ క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. సీనియర్ ఎన్టీఆర్ శ్రీమతి పేరుమీద ఇలాంటి ఆస్పత్రిని ఏర్పాటు చేసి కోట్లాది మందికి సేవా దృక్పథంతో సేవలు అందివ్వడంలో నంద మూరి బాలకృష్ణ ముందుకు రావడం మంచి పరిణామమని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు నిర్వాహక బృందానికి బాలకృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రత్యేకృతజ్ఞతతలు తెలిపారు.



హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను సత్కరిస్తున్న దృశ్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

## గ్రేటర్‌లో కంటోన్‌మెంట్ విలీనానికి ఉద్యమించాలి

### ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ బోర్డు సివిలియన్ ఏరియా ప్రాంతాలను గ్రేటర్‌లో విలీనం చేసేందుకు పార్టీలకతీతంగా జేఏసి సంఘటితంగా ఉద్యమించాలని ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ పిలుపునిచ్చారు. ఆదివారం బాలంరాయిలోని లీప్యాలెస్‌లో ఏర్పాటు చేసిన జేఏసి సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కంటోన్‌మెంట్ బోర్డును జిహెచ్ఎంసిలో విలీనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు వివిధ రూపాల్లో కార్యక్రమాలను చేపట్టాలన్నారు. విలీన పోరాటానికి కలిసి వచ్చేవారికి స్వాగతం పలుకుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వికాస్ మంచ్ ప్రధాన కార్యదర్శి సంకి రవిందర్,దేవేందర్‌లతో పాటు బోర్డు పరిధిలోని 40 కాలనీల అధ్యక్ష, కార్యదర్శులు, మేధావులు, కవులు కళాకారులు పాల్గొన్నారు.

## కెసిఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేయడం సరైంది కాదు


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న మన్నె క్రిషాంక్ తదితరులు

**కంటోన్మెంట్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** తొలి ముఖ్యమంత్రి కేసిఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేయడం సరైంది కాదని బిఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిషాంక్ తెలిపారు. కెసిఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేయడంపై నిరసన తెలుపుతూ ఆదివారం పికెట్ చౌరస్తా నుంచి తెలంగాణ భవన్‌కు 230 మందితో నల్ల జెండాలు,బ్యాడ్జీలు ధరించి భారీ ర్యాలీతో తరలివెళ్లారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ యువ నాయకులు ఏ.ఎల్.ఆనంద్, మోనీ, అనీష్,యాసీన్, వినీత్, కమలేశ్, జోడి బ్రదర్స్ పాల్గొన్నారు.

## కార్పొరేటర్ ప్రసన్న హౌజ్ అరెస్ట్


అడ్డగుట్ట కార్పొరేటర్‌ను హౌజ్ అరెస్ట్ చేసిన పోలీసుల

**అడ్డగుట్ట, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** బిఆర్ఎస్ అధినేత, మాజీ సిఎం కెసిఆర్‌కు జారీచేసిన సిట్ విచారణ నోటీసును వ్యతిరేకిస్తూ బిఆర్ఎస్ తలపెట్టిన శాంతియుత నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా ఉండేందుకు అడ్డగుట్ట డివిజన్ కార్పొరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్‌ను ఆదివారం లాలాగూడ పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు.

## నిబంధనల ప్రకారమే వ్యాపారం జరగాలి

### గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్‌ముదిరాజ్


మార్కెట్‌లో తనిఖీ చేస్తున్న చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్

**మెహిదీపట్నం, ఫిబ్రవరి 01, ప్రభాతవార్త :** మార్కెట్ నిబంధనల ప్రకారమే కమిషన్ ఏజెంట్లు తమ వ్యాపారాలను కొనసాగించాలని, లేనియెడల చర్యలు తప్పవని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్ హెచ్చరించారు. మార్కెట్ అధికారులపై బెదిరింపులకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. కూరగాయల కమిషన్ ఏజెంట్ షాపులలోని కాంటాలపై కొందరు కొనుగోలుదారులు గత కొన్ని రోజులుగా ఫిర్యాదులు చేస్తుండడంతో మార్కెట్ అధికారులతో కలిసి కమిషన్ ఏజెంట్ షాపులతో పాటు కాంటాలను తనిఖీ చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా తలారి మల్లేష్ ముదిరాజ్ మాట్లాడుతూ...కూరగాయల కమిషన్ ఏజెంట్ షాపులో ఒక కాంటాకు బదులుగా రెండు, మూడు కాంటాలు ఉండటంతో వాటిని తొలగించాలని కమిషన్ ఏజెంట్లను ఆదేశించామన్నారు. ఉల్లిగడ్డ, ఆలుగడ్డలకు చెందిన కమిషన్ ఏజెంట్ దారులు కొందరు బినామీల పేరుతో వ్యాపారాలు నిర్వహిస్తుండడం మార్కెట్ నిబంధనలకు విరుద్ధమని, ఉల్లిగడ్డ, ఆలుగడ్డ వ్యాపారులు మార్కెట్ నిబంధనలు పాటించకుంటే వారి కమిషన్ ఏజెంట్ లైసెన్స్‌ను రద్దుచేసి మరొకరికి లైసెన్సులను జారీ చేస్తామన్నారు.

## 'ఆలయాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి'

**కంటోన్మెంట్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** ఆలయాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ కోరారు. పౌర్ణమిని పురస్కరించుకొని ఆదివారం 6వ వార్డు సీతారాంపూర్ కాలనీలోని శివ పంచాయతన హన్‌మాన్ దేవాలయంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని మాజీ బోర్డు సభ్యుడు పాండుయాదవ్ తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అన్నదాత రాజశేఖర్, ఆలయ కమిటీ చైర్మన్ సాయిబాబా యాదవ్,సభ్యులు విజయ్ బాబు, గోవర్ధన్, రాజు, శ్రీకాంత్ రెడ్డి,ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## మోహినీఘట్టం ఆధారిత అద్భుత నృత్యనాటకం

**రవీంద్రభారతి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :** ఎడస్సీరి గోవిందన్ నాయర్ రచించిన మలయాళంలోని ఒక ఉత్తమకావ్యం పూతప్పట్టు ప్రపంచ సాహిత్యంలోనే అత్యుత్తమ రచనల్లో ఒకటని, ఇది వల్లువనాడు ప్రాంతంలోని పూతన్ అనే పురాణగాథ చుట్టూ అల్లుకుని ఉన్న మోహినీయాట్టం ఆధారిత అద్భుత అతి పురాణగాథ పూతప్పట్టు నృత్యనాటకం నిమేష్‌శర్మ సంగీతం, గురు డా. కళామండలం సుగంధి కొరియోగ్రఫీలో రూపొంది ఆహుతులను తన్మయుల్ని చేసింది. ఒక తల్లి తన బిడ్డపై చూపించే ప్రేమకు, త్యాగానికి ప్రతీకగా కీర్తించపబడుతుంది. ప్రముఖ ఆలై సంస్థ ఆధ్వర్యంలో సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళావేదికలో తెలంగాణకు ప్రామాణిక కేరళ సంప్రదాయ ప్రదర్శనలను తీసుకురావడానికి, పరస్పర సాంస్కృతిక సంబంధాలను నెలకొల్పడంతో ప్రయత్నంగా, లాలాపేటలోని బ్లూఫౌండేషన్ అనాథాశ్రమ పిల్లల సహాయార్థం ఈ పూతప్పట్టు నృత్యనాటకం ప్రదర్శించినట్లు నిర్వాహకులు తెలిపారు.


పూతప్పట్టు నృత్యనాటకం దృశ్యం

# ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరిస్తా

### ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి


సమావేశం మాట్లాడుతున్న మొగుళ్ల రాజిరెడ్డి, చిత్రంలో సి.సతీష్‌కుమార్ తదితరులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త**

తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ (ఐఎన్‌టియుసి అనుబంధ) కార్మికుల సమస్యలు పరి ష్కరిస్తానని ఐఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి అన్నారు. బర్కత్‌పుర, ఐఎన్‌టియుసి నగర కార్యాలయంలో ఆదివారం తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ సర్వసభ్య సమావేశం సి.సతీష్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి.చంద్రశేఖర్, యూనియన్ ప్రధానకార్యదర్శి రాఘవేంద్రరాజ్, అసోసియేట్ ప్రెసిడెంట్ అలీ శ్రవణ్‌కుమార్, వాటర్‌వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు కె.రాజిరెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎండి జాంగిర్ పాల్గొనగా, తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడిగా మొగుళ్ల రాజిరెడ్డిని నియమించాలన్న ప్రతిపాదనను సి.సతీష్ కుమార్ ఏకగ్రీవ తీర్మానం ప్రవేశపెట్టాగా, సభ్యులు ఆమోదం తెలిపి మొగుళ్ల రాజిరెడ్డిని యూనియన్ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఎన్‌టియుసి జాతీయఅధ్యక్షుడు జి.సంజీవరెడ్డి, యూనియన్ గౌరవ అధ్యక్షుడు మధు యాష్కీగౌడ్ సలహాలు, సూచనతో యూనియన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు తెలుపుతూ, వాటర్ బోర్డులో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి సమస్యలపై నిరంతరంగా పోరాడతానని, మేనేజ్‌మెంట్‌తో చర్చించి, అవసరమైతే ప్రభుత్వ పెద్దలతో చర్చించి సమస్యలను పరిష్కరిస్తానని స్పష్టం చేశారు. రాబోయే జలమండలి గుర్తింపు సంఘం ఎన్నికల్లో అన్ని యూనియన్లు, అసోసియేషన్లు ఏకతాటిపైకి వచ్చి యూనియన్‌ను తిరుగులేని మెజార్టీతో గెలిపించాలని మొగుళ్ల రాజిరెడ్డి పిలుపునిచ్చారు. ఆర్.డి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఐఎన్‌టియుసి పూర్తి మద్దతు తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్‌కు ఉంటుందని ప్రకటించడంతో పాటు, ఐఎన్‌టియుసి అప్లికేషన్ కూడ తర్వాత సమావేశంలో అందజేస్తానని తెలిపారు. ఈ సమావేశం యూనియన్ గౌరవ ఉప సలహాదారులుగా సి.సతీష్ కుమార్ ఎన్నుకుంది. ఈ కార్యక్రమంలో మేవ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సైద్ అక్తర్ అలీ, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.నర్సింగ్‌రావు, ఏం రాజా, బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి జై రాజు, నేతలు పి.చంద్రశేఖర్, బి.శంకర్‌ప్రకాష్, కె.ఆనంద్ రెడ్డి, ఎం.రాంచేందర్, సి.రాజు, మజారుద్దీన్, హాసిం, కృష్ణ ముదిరాజ్, రాములు ముదిరాజ్, జయ శంకర్, అజయ్‌నాథ్, లక్ష్మణ్‌యాదవ్, శ్రీనివాస్ యాదవ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానిస్తున్న బండి రమేష్

## కాంగ్రెస్‌లో చేరికలు...

**కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు పట్ల ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. కెపిహెచ్‌బి కాలనీకి చెందిన బిఆర్ఎస్ నాయకుడు మోటేపల్లి రంగమ్మోహన ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద జరిగిన బహిరంగ సభలో 200 మంది కార్యకర్తలు బండి రమేష్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా సంజీవని ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు

**కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త :** కూకట్‌పల్లి పాపారాయుడు నగర్‌లోని శ్రీసంజీవని ఆంజనేయ స్వామి తృతీయ వార్షికోత్సవ పూజ మహోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు హాజరై భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో శాంతి, ఐక్యత, ధార్మిక విలువలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని వడ్డేపల్లి అన్నారు. యువత ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా క్రమశిక్షణ, సత్సంకల్పం అలవడుతుందని తెలిపారు. సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాజేశ్వరరావు పేర్కొన్నారు. ఈ పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులను వడ్డేపల్లి రాజేశ్వరరావు అభినందించి, భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం : సెల్వ సాయిరామ్‌రాజ్

**జీడిమెట్ల, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త :** లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ 320 బి కి ఆదర్శవంతమైన క్లబ్ అని డిస్ట్రిక్ట్ గవర్నర్ సెల్వ సాయి రామ్ రాజ్ అభినందించారు. సికింద్రాబాద్ నార్త్ చాటర్ నైట్ కార్యక్రమం జీడిమెట్లలోని ఓ ప్రైవేటు హోటల్లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డిస్టిక్ గవర్నర్ లయన్స్ క్లబ్ సేవలను కొనియాడారు. ఐదు సంవత్సరాలుగా ఉదయం అల్పాహారం అందిస్తూ అన్ని లయన్స్ క్లబ్బులకు ఆదర్శంగా నిలిచిందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టాలని ఆకాంక్షి ంచారు. సికింద్రాబాద్ నార్త్ క్లబ్ ప్రపంచంలోనే ఎనిమిదవ అత్యంత పెద్ద క్లబ్‌గా గుర్తింపు పొందిందన్నారు. ఈ కార్యక్రమంలో మల్టీ జోనల్ కౌన్సిల్ చైర్మన్ రాజేంద్ర ప్రసాద్, మాజీ గవర్నర్ లు విద్యాసాగర్, విజయ్ కుమార్ శెట్టి, లయన్స్ క్లబ్ సికింద్రాబాద్ నార్త్ అధ్యక్షులు బిర్రు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి జనార్ధన్ దయాకర్, నాయకులు శైలజ నాయర్, చల్ల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కనుల పండువగా వెంకటేశ్వరుని కళ్యాణం

కంటోన్మెంట్,ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: కంటోన్మెంట్ బోయిన్‌పల్లి న్యూసిటీ కాలనీలో ప్రసిద్ధిగాంచిన శ్రీ వెంకటేశ్వర స్వామి 24వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయంలో హోమం, లలితా పారాయణం పూజా వేడుకలు ఘనంగా జరిగాయి. ఈవేడుకలకు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్,బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బానుక మల్లికార్జున్,రిటైర్డ్ పోలీస్ అధికారి అంజయ్యలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసర ప్రాంతాలన్నీ పూలమాలలతో రంగు రంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబ్ చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు నారాయణ, రాంమోహన్, యాదయ్య, అన్నపరెడ్డి, అత్మానందరెడ్డి, బచ్చులక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## 'కెసిఆర్‌పై అక్రమ కేసులు పెట్టడం సరైందికాదు'

**కంటోన్మెంట్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** బిఆర్ఎస్ అధినేత, మాజీ సిఎం కేసిఆర్ ఆరోగ్యంగా ఉంటూ ప్రజల ఆశీర్వాదంతో రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రి కావాలని కోరుతూ కంటోన్మెంట్ మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేసిఆర్‌పై అక్రమ కేసులు బనాయించి వేధింపులకు పాల్పడడం సరైంది కాదని, దేవుడు ఆయనను కాపాడాలని కోరుతూ ఆదివారం జహింగీర్ పీర్ దర్గా వద్ద నిర్వహించినప్రత్యేక ప్రార్ధనల్లో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మైనార్టీ నేత హసిన్‌ఖాన్, బిఆర్ఎస్ నాయకులు నర్సింహా రావ్, బి.శ్రీనివాస్, సందాని, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, నోముల ప్రకాశరావు

## మన ఆరోగ్యం మన చేతుల్లోనే

### మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

**సికింద్రాబాద్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉన్నదని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, బీఆర్ఎస్ నేత నోముల ప్రకాశరావులు అన్నారు. ఆదివారం గాంధీ మెడికల్ కాలేజీలో మెడికల్ కాలేజీ, జనహిత ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సిపిఆర్ శిక్షణ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కల్తీఆహారం, కలుషితమైన వాతావరణంవల్ల వివిధరకాల ఆరోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. మన ముందు తరం వారు ఎలాంటి కల్తీ లేని స్వచ్ఛమైన ఆహారం తీసుకోవడంవల్ల ఎంతో ఆరోగ్యంగా ఉన్నారని, ఎక్కువ కాలం పాటు ఎలాంటి అనారోగ్యం దరిచేకుండా జీవించారని వివరించారు. ప్రస్తుతం మనం కల్తీ ఆహారం తినడం, ఆరోగ్యపరంగా తగు జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల పలు ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నామని చెప్పారు. ప్రధానంగా గుండె సంబంధిత సమస్యలతో బాధపడేవారి సంఖ్య గణనీయంగా పెరిగిన విషయాన్ని గుర్తు చేశారు. గుండెపోటుకు గురైన వారికి తక్షణమే సిపిఆర్ చేయడం వల్ల బ్రతికించే అవకాశాలు ఉంటాయని చెప్పారు. సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్, నిర్వాహకులు నర్సింహామూర్తి, రవీందర్, డాక్టర్లు లింగమూర్తి, రాజశేఖర్, రాజశేఖర్, మహేశ్వర్ రెడ్డి, లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, శ్రీధర్‌కుమార్, నేతలు నాయకులు ఏసూరి మహేష్, శ్రీకాంత్ రెడ్డి, మహేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

## రామలింగేశ్వర స్వామికి సహస్రనామ బిల్వార్చన

**నిజాంపేట్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త :** మాఘపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం కౌసల్యకాలనీలోని శ్రీవెంకట శివరామాలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త, 17వ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆగం రాజుముదిరాజ్ శ్రీరామలింగేశ్వర స్వామి వారికి ఏకాదశ వార సహస్రనామ బిల్వార్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య అభిషేకాలు, ప్రత్యేక హారతులు నిర్వహించగా, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## పార్కు స్థలాన్ని కాపాడి అభివృద్ధి చేయాలి

**కూకట్‌పల్లి, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త :** మూసాపేట్ ఆంజనేయనగర్ రోడ్ నెంబర్ 9లో ఉన్న పార్కు స్థలాన్ని కాపాడి అభివృద్ధి చేయాలని కోరుతూ ఆంజనేయనగర్ సభ్యులు మహేందర్ లోకేష్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపట్టారు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు మున్సిపల్ కార్యాలయానికి చేరుకొని, దీక్ష చేస్తున్న ఆంజనేయ నగర్ కాలనీ వాసులకు సంఘీభావం తెలుపుతూ స్వయంగా దీక్షలో కూర్చున్నారు. అనంతరం సంబంధిత మున్సిపల్ అధికారులతో మాట్లాడి పార్కు స్థల ప్రాధాన్యతను కాలనీ ప్రజల అవసరాలను వివరించి సమస్యను పరిష్కరించే దిశగా గట్టి ప్రయత్నం చేశారు. స్పందించిన అధికారులు పార్కు అభివృద్ధి పనులు త్వరలోనే చేపడతామని హామీ ఇచ్చారు. అధికారుల హామీ నేపథ్యంలో దీక్ష చేపట్టిన మహేందర్, లోకేష్‌తో పాటు ఇతర కాలనీ సభ్యులు పరస్పర చర్చల అనంతరం రాజేశ్వరరావు మహేందర్ లోకేష్‌కు కొబ్బరి నీళ్లను అందించి నిరాహార దీక్షను విరమింపచేశారు. ప్రజల కోసం పార్కు అభివృద్ధి జరిగే వరకు తమ మద్దతు కొనసాగుతుందని రాజేశ్వరరావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మూసాపేట్ డివిజన్ కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్, మూసాపేట్, బాలాజీ నగర్ డివిజన్ బిజెపి నాయకులు అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్ రావు, డాకయ్య, మల్లేష్ గౌడ్, జీవన్, శేఖర్ గుప్తా, వినోద్ గౌడ్, ఇ.సాయి, పిట్ల మనోహర్, పండుగ రేణుక తదితరులు పాల్గొన్నారు.


మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేస్తున్న దృశ్యం

# పద్యం తెలుగుజాతికి అద్దం

### తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి


రమణాచారిని సత్కరిస్తున్న అశోక్‌తేజ, హనుమంతరావు తదితరులు

**నాంపల్లి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :** పద్యం తెలుగుజాతి అద్దం వంటిదని, అది ఎన్నటికీ తరగతి సంపదని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అన్నారు. పాతికేళ్లక్రితం సాధన సాహితీ స్రవంతి సంస్థ తెలుగు లలితకళాతోరణంలో మొదటిసారి పద్యసాధన కార్యక్రమం మొదలుపెట్టి నేడు రజతోత్సవ పద్యసాధన విజయోత్సవం జరుపుకొంటున్న వేళ వారికి శుభాకాంక్షలు తెలిపారు. పద్యంతో సాహిత్యంపై పట్టులభించి జీవితాంతం గుర్తుండిపోతాయన్నారు. ఈ సందర్భంగా రమణాచారి ఒక పద్యశ్లోకాన్ని ఉటంకించి విద్యవల్ల వినయం, వినయంతో యోగ్యత, యోగ్యతతో ధనం, ధనంతో ధర్మం, తద్వారా సుఖమొస్తుందన్న నిత్యసత్యమన్నారు. కష్టబెట్టబోకు తల్లిమనస్సుని, నష్టబొట్టబోకు తండ్రి పనుల్ని.. కనిపించే దైవమే తల్లిదండ్రులు అని వ్రాసిన పద్యం నిత్యజీవిత సత్యమని స్పష్టం చేశారు. వారు మనని చదివించి రక్షించి కాపాడితేనే ఇప్పుడున్న స్థాయి కొచ్చామన్న విషయం మరువరాదని హితవుపలికారు.సాధన సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో 44వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారకరామారావు కళావేదికలో డా. టి.గౌరీశంకర్ సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డా. కె.వి.రమణాచారి విశిష్ట అతిథులు జాతీయకవి డా. సుద్దాల అశోక్‌తేజ, సిహెచ్.హనుమంతరావు, అశ్విని సుబ్బారావు, సంస్థ అధ్యక్షుడు సాధన నరసింహాచార్య తదితరులతో కలిసి రజతోత్సవ పద్యసాధన విజయోత్సవంలో భాగంగా తెలుగుబాల–నండూరి శతకపద్య మౌఖిక పరీక్ష విజేతలకు బహుమతులు ప్రదానంచేసి శుభాశీస్సులందజేసి ప్రసంగించారు. సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ సినిమా సాహితీసద్య స్ఫూర్తికి నాకు మేలుచేసింది పద్యదీప్తి అన్నారు. పద్యం తెలుగుజాతి సొంద ర్యాన్ని, సౌకుమార్యాన్ని తెలియజేసి జీవిత తాత్వికతను ప్రదర్శిస్తుందన్నారు. ఈ సందర్భంగా డా. కె.వి.రమణాచారిని ఘనంగా సత్కరించారు.

## ఐఐటిని సందర్శించిన పారిశుద్ధ్య కార్మికుల పిల్లలు

**చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త :** జీహెచ్ఎంసిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల పిల్లలు సంగారెడ్డిలోని హైదరాబాద్ ఐఐటీని సందర్శించారు. చార్మినార్, రాజేంద్రనగర్, శంషాబాద్ జోన్లనుంచి ఎంపిక చేసిన 29 మంది పారిశుధ్య కార్మికుల పిల్లలకు ఐఐటీలోని వివిధ విభాగాలు, పరిశోధనలు, పలుఅంశాలపై అధ్యాపకులు వివరించారు. తొలిసారి ఐఐటీల గురించి వినటమే తప్పా ప్రత్యక్షంగా ఎన్నడూ చూసింది లేదన్నారు. జీహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ తమపై శ్రద్ధ చూపి ఉన్నత విద్యల పట్ల ఆసక్తి పెంపొందించుకునేలా కార్యక్రమాన్ని రూపొందించినందుకు హర్షం వ్యక్తం చేశారు. కాగా చార్మినార్, రాజేంద్రనగర్, శంషాబాద్ జోన్ల నోడల్ అధికారి (పీఓ) వై.కరుణాకర్ ఆధ్వర్యంలో సంగారెడ్డిలో గల ఐఐటి హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. మహాకమిషనర్ ఆర్.వి.కర్ణన్ ఆదేశాల మేరకు 6-10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులను ప్రత్యేక బస్సులలో సంగారెడ్డికి తీసుకెళ్లారు. చాంద్రాయణగుట్ట, నర్కిపూల్‌బాగ్ వద్ద గల చార్మినార్ జోనల్ కార్యాలయం కేంద్రం నుండి 29 మంది విద్యార్థులతో గల ప్రత్యేక బస్సు బయలుదేరి వెళ్ళింది. చార్మినార్ జోన్‌లోని ఐదు సర్కిళ్ల నుండి 12 మంది, రాజేంద్రనగర్ జోన్లోని చాంద్రాయణగుట్ట, జంగమ్మెట్ సర్కిళ్ల నుండి ఐదు మంది, శంషాబాద్ జోన్లోని నాలుగు సర్కిళ్ల నుండి 12 మందితో కలిపి మొత్తం 29 మంది విద్యార్థులు ఐఐటి సందర్శించినట్లు నోడల్ అధికారి కరుణాకర్ వెల్లడించారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలనే లక్ష్యం, శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలనే ఉద్దేశంతో మహా కమిషనర్ కర్ణన్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

## తెలంగాణకు నిధులు కేటాయించకపోవటం విచారకరం

### పంచాయతీరాజ్ ట్రిబ్యునల్ మాజీ సభ్యులు పులిగారి గోవర్ధన్‌రెడ్డి

**ముషీరాబాద్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రానికి, ముఖ్యంగా హైదరాబాద్ మెట్రో-2, మూసీ పునర్జీవన ప్రాజెక్టుకు కేంద్ర బడ్జెట్-2026లో నిధులు కేటాయించకపోవటం విచారకరమని తెలంగాణ పంచాయతీరాజ్ ట్రిబ్యునల్ మాజీ సభ్యులు పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన కవాడిగూడలో విలేఖరులతో మాట్లాడుతూ 12.75 లక్షల వరకు ఆదాయ పన్ను నుంచి ఉపశమనం కల్పించటం మధ్యతరగతి వారికి లాభదాయకంగా ఉంటుందని, ఏడు నగరాల మధ్య హైస్పీడ్ రైళ్ల వల్ల వర్తక, ప్రయాణీకులకు సమయాభారం తగ్గుతుందని రెర్ ఎర్త్ కారిడార్ల వల్ల ఎలక్ట్రిక్ వస్తువుల ధరలు తగ్గటమే కాకుండా, చైనా నుంచి ముడి సరుకుల దిగుమతి కూడా తగ్గుతుందని, ఇవి హర్షనీయమన్నారు. ఇదే నేపథ్యంలో తెలంగాణకు కూడా నిధులు కేటాయిస్తే, తెలంగాణకు మరింత మేలు జరిగేదని అభిప్రాయపడ్డారు.

## వైభవంగా శ్రీ బాల మురుగన్ కుమారస్వామి తైపోత్సవం

**పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త :** సర్కిల్ పరిధిలోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సుభాష్ నగర్ డివిజన్‌లో శ్రీశ్రీశ్రీ బాల మురుగన్ కుమారస్వామి తైపోత్సవం ప్రత్యేక పూజలు ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం తమిళయన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కొట్టాయి స్వామి అధ్యక్షతన, తమిళయన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. పళనిలో జరిగే తైపోత్సవ పూజా విధానాన్ని అనుసరించి, ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీ కుమారస్వామి - వల్లిని దేవి కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించారు. ఉదయం నుంచి కావడి ఊరేగింపుతో స్వామివారు సుభాష్ నగర్‌కు విచ్చేసినట్లు ఆలయ వాతావరణం భక్తితోనిండిపోయింది. ఈ సందర్భంగా తమిళయన్స్ అసోసియేషన్ ముఖ్య నాయకులు బాలమురుగన్ మాట్లాడుతూ పళనిలో జరిగే తైపోత్సవాన్ని ప్రతిబింబించేలా బాలమురుగన్ స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు, కళ్యాణం నిర్వహించామని తెలిపారు. ఈ పూజా వేడుకల్లో స్థానిక బీజేపీ నాయకులు భారతసింహా రెడ్డి, వాసు ముఖ్య అతిథులుగా పాల్గొనగా, వారి సహకారానికి నిర్వాహకులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజకీయ నాయకులు, సుభాష్ నగర్ డివిజన్‌కు చెందిన ప్రముఖులు, తమిళయన్స్ అసోసియేషన్ అధ్యక్షులు పి.కొట్టాయి స్వామి, వైస్ ప్రెసిడెంట్ ఆర్. గణేశన్, జనరల్ సెక్రటరీ కె. చిన్న స్వామి, ట్రెజరర్ టి. భాస్కర్, జాయింట్ సెక్రటరీ ఎస్. ఆనందం, తదితర అసోసియేషన్ సభ్యులు, స్థానికులు, మహిళలు , భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

### సామాజిక భవనంలో వైద్యశాల ఏర్పాటుకు వ్యతిరేకంగా నిరసన

**అల్వాల్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** అల్వాల్ వెంకటాపురంలోని అంబేడ్కర్ సామాజిక భవనంలో వైద్యశాల ఏర్పాటును ఆపాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఆదివారం ఈ మేరకు భవనం ఎదుట ఆందోళన చేస్తున్న వారికి కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి మద్దతు తెలిపారు. సుభాష్‌నగర్ లోని హెల్త్ సెంటర్‌ను భవనంలోకి మార్చడం సమంజసం కాదని తెలిపారు. భవనం పేద మధ్య తరగతి ప్రజలకు ఎంతగానో ఉపయోగ పడుతోందని పేర్కొన్నారు. ఈ మేరకు ప్రభుత్వ తక్షణం హెల్త్ సెంటర్ ఏర్పాటును ఆపాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమాజిక భవనం కమిటీ సభ్యులతో పాటుగా బిఆర్ఎస్ నేతలు అనీల్ కిషోర్, ప్రేమ్, అరుణ్, అరవింద్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ కక్షతోనే కెసిఆర్‌ను ఇబ్బంది పెడుతున్న ప్రభుత్వం: ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**అల్వాల్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** రాజకీయ కక్ష సాధింపు చర్యలులో బాగంగా కెసిఆర్ సిట్ విచారణ అని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఎర్రవల్లి ఫామ్ హౌజ్ నుంచి అల్వాల్ మీదుగా సిట్ విచారణకు కెసిఆర్ వెళ్ళే మార్గంలోని గోల్నాక అల్వాల్ వద్ద ఆయన పార్టీ శ్రేణులుతో కలిసి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను తప్పుదారి పట్టించేందుకు విచారణ పేరుతో డ్రామాలు అందుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ గౌడ్, అనీల్ కిషోర్ పాల్గొన్నారు.

## పట్నంలో ప్రభలతీర్థం.. అపర్ణలో పల్లె సంబరం

**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :** పట్నంలో ప్రభలతీర్థం అంగరంగం వైభవంగా జరిగింది. మూడురోజులపాటు శేరిలింగంపల్లి నల్లగండ్లలోని అపర్ణ సరోవర్‌లో పల్లెసంబరాలు అంబరాన్నంటాయి. ఆంధ్ర ప్రదేశ్‌లోని తూర్పుగోదావరిజిల్లాలో జరిగే ప్రభలతీర్థం జాతర,సరికొత్తగా పట్నంలో అవిష్కరించారు. కళాత్మకంగా,సుందరంగా అలంకరించిన ప్రభలను పల్లెటూరు నుంచి తీసుకువచ్చి స్థానిక శివాలయంలో పరమేశ్వరు డినిక దూప హరతిసేవ, పూజలు నిర్వహించారు. వారం రోజుల నుంచి గుడిలో కొలువైన దేవుళ్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలను జరిపారు. ఇందులో భాగంగా ప్రభల ఊరేగింపు, నాధస్వర బృందం భక్తితో సరస్వతీ పుత్రులు ఈశ్వరుడిని కొలుస్తూ స్వర సమర్పణ చేశారు.స్థానిక చిన్నారులు పౌరాణిక వేణదారణలతో భక్తుల ముందు నడుస్తూ ముచ్చట గొలిపారు. మేళతాళాలు, కోలాటాల మధ్య అంగరంగ వైవభంగా సరికొత్త ప్రభలపై విరాజిల్లుతూ శరబేశ్వరుడికి సుందరంగా, సుమనోహరంగా ఉత్సావాలను జరిపారు. అదేవిధంగా అపర్ణ సరోవర్‌లో తిరునాళ్ల వాతావణం కనిపించింది. ముచ్చటగా ప్రభలపై విరాజిల్లిన శివుడు గుడిలో కొలువైన లింగం రూపంలో దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా సూత్రదార్ అనే పేరుతో చాలా వినూత్నమైన కార్యక్రమాలను నిర్వహించారు. సాలెపురుగు దశనుంచి పట్టుపోగు ఎలా తయారవుతుందో, అక్కడి నుంచి ఆసుపై డిజైన్ ఎలా వేస్తారో, చివరికి చేనేత కార్మికులు ఏ విధంగా బట్టలు నేసి ప్రజలకు అందిస్తారో పూర్తిప్రక్రియలను ఒక టెక్స్‌టైల్ ఇంజనీర్ డెమె ద్వారా సులభంగా వివరించారు. పోచంపల్లి హస్తకళా ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారులు రంగుల రాట్నాలు, కుమ్మరి, గాజుల సవ్వడి, చేనేత హస్తకళల అంగడి, చిలుక జోస్యం,నోటితో ఊదే బూరలు, సరదాగా లైటెల్లు చిందిస్తున్న బొమ్మలు,వేడివేడిపకోడీలు,బజ్జీలు, బూరలు, పుల్లట్లు,పెసరట్లు,వివాహ భోజనంబు, పిడతకింద పప్పుల వింతైన వంటకాలు, హెడ్‌ఫోన్ కంప్యూటర్ జాతకంతో పాటు సంగీత కచేరీలు ఆహుతులను విశేషంగా అలరించాయి. ఈ సందర్భంగా ప్రభల తీర్థం ఆర్గనైజర్ చందన మాట్లాడుతూ.. ప్రతి ఏటా ప్రభల తీర్థం జాతరను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ముఖ్యంగా పల్లెల్లో ని సంస్కృతి, సంప్రదాయాలను పట్నంలో కొనసాగించాలనే ఉద్దేశ్యంతో జారత నిర్వహి స్తున్నట్లు తెలిపారు. జాతరల్లో మంచి విశేషాలను మనతో పాటు ముందుకు తీసుకువెళుతూ రాబోయే తరాలకు అందజేయాలనే తపన,తపస్సుతోనే ప్రభల తీర్థం జాతరను చేపట్టినట్లు ఆమె వివరించారు.

### విద్యుత్ సమస్యలను పరిష్కరించండి: కొండల్‌రెడ్డి

**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :** పాపిరెడ్డినగర్‌కాలనీలోని నెలకున్న విద్యుత్‌సమస్యలపై అధికారులు దృష్టిపెట్టాలని పాపిరెడ్డినగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బద్దం కొండల్‌రెడ్డి కోరారు. విద్యుత్ ఉగ్యోగులు చేపట్టిన బస్తీబాట కార్యక్రమంలో భాగంగా కాలనీ వాసులతో కలిసి విద్యుత్ అధికారులతో కాలనీలో నెలకున్న విద్యుత్ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా బద్దం కొండల్‌రెడ్డి మాట్లాడుతూ.. పాపిరెడ్డి కాలనీ అతిపెద్ద మురికివాడగా ఉందని, విద్యుత్ సమస్యలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా లోఓల్టేజీ సమస్యతో పాటు కొన్ని విద్యుత్ ఫోల్స్ సమస్యలు, ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలు ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులకు విన్నవించారు. ఈ విద్యుత్ బస్తీబాటలో గచ్చిబౌలి ఏడీఈ శివప్రసాద్; తారానగర్ ఏఈ హుస్సేన్,లైన్ ఇన్స్‌పెక్టర్ బ్రహ్మం,తారానగర్ విద్యుత్ ఉద్యోగులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నగారా రమేష్

## లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ఉద్యోగ భద్రత కల్పించి, వేతనాలు చెల్లించాలి

**సైఫాబాద్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం 8 నెలల క్రితం నియమించిన ఎల్ఎస్ఎస్ లైసెన్స్‌డ్‌సర్వేయర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పిస్తూ, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ఎల్ఎస్ఎస్ లైసెన్స్‌డ్ సర్వేయర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు నగారా రమేష్, కన్వీనర్ చాగంటి నరేష్, కార్యదర్శులు సంధ్య, నాగరాజు సిఎం రేవంత్‌రెడ్డి , రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి సుధాకర్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ భూ భారతి చట్టం రాలేదని తమపైన నిర్లక్ష్యం చేయరాదన్నారు. తమకు విధి విధాలను ప్రకటించాలని, బీమా సౌకర్యం కల్పించాలని, ఉచితంగా వైద్య సౌకర్యం అందిచాలని, వారి, వారి మండలాల్లోనే సర్వేయర్స్‌ను నిమించాలని, సర్వేకు సంబంధించిన వస్తువులను ప్రభుత్వం అందించాలని, లేకపోతే రుణం ద్వారా అందిచాలని కోరారు. తమ సమస్యలు పరిష్కారించాలని రాష్ట్ర వ్యాప్తంగా ఐదున్నర వేల మంది సర్వేయర్స్ ఉన్నారని వారు తెలిపారు. గతంలో సర్వేయర్స్‌ను రాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వామ్యం చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, కాని ఇంతవరకు ఏలాంటి కదలికలు లేవన్నారు. 20 వేల ఎకరాలు సర్వే చేస్తే 40 వేల ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, దీని వల్ల ఒక్కొక్క సర్వేయర్‌కు రోజుకు 20 రూపాయలు పడుతుందని, ఇవి ఏమాత్రం సరిపోవని వారు ఆందోళన వ్యక్తం చేశారు. సిఎం, రెవిన్యూశాఖ మంత్రి తమ సమస్యలపై సానుకూలంగా స్పందించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సందీప్, పరమేష్, రాజు, సురేష్, సౌందర్య, శివ, జగదీష్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయం చేయాలని దళితుడి అర్థనగ్న ప్రదర్శన



చెప్పుల దండతో అర్థనగ్నతో మాట్లాడుతున్న వినోద్

**సైఫాబాద, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** హైకోర్టు ఆదేశాలను దిక్కరిస్తూ భూకబ్జాదారులతో కుమ్ముకైన స్థానిక పోలీసులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని, అర్థనగ్నంతో చెప్పులు మెడలో వేసుకుని ఒక దళితుడు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పిసిసి ఎస్సీ సెల్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వోయ్య వినోద్ మాట్లాడుతూ జగద్గిరిగుట్టలో 2000 సంవత్సరంలో తాను, చంద్ర రుక్మిణి అనే మహిళా కలిసి 1700 గజాల స్థలాన్ని నాగయ్య అనే వ్యక్తి వద్ద కొనుగోలు చేసి రాజీవ్‌గాంధీ పేరిట అనాథ శరణాలయాన్ని నడుపుతున్నామని చెప్పారు. కాగా ఆ స్థలంపై కన్నువేసిన కొంత మంది భూ కబ్జాదారులు పోలీసులతో కలిసి దొంగ సర్టిఫికేట్లు సృష్టంచి సగానికిపైగా భూమిని కాజేశారని, అనాథ అశ్రమం నుంచి తమను వెళ్ళగొట్టారని ఆరోపించారు. దీంతో తాము హైకోర్టులను అశ్రయించాలమని హైకోర్టు తనకు, తన స్థలానికి రక్షణ కల్పించాలని ఆదేశాలు జారీ చేసిందని, కాని పోలీసులు తనకు రక్షణ కల్పించకుండా భూకబ్జాదారులతో కలిసి తనను వేధింపులకు గురి చేశారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకు ముఖ్యమైన బాధ్యుడు సిఐ, భూకబ్జాదారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుని తన అనాధ అశ్రమాన్ని అప్పగించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## సినీ నటుడు బ్రహ్మానందం కు అభినందన సత్కారం

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 1(ప్రభాతవార్త):** ప్రపంచ ప్రఖ్యాత తెలుగు చలన చిత్ర నటులు, గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ గ్రహీత డాక్టర్ బ్రహ్మానందం కు అభినందన సత్కార కార్యక్రమం ఫాస్ (ఫిలిం అనలిటికల్ అండ్ అప్రిసియేషన్ సొసైటీ) అధినేత, సంస్కృతిరత్న డాక్టర్ కె.ధర్మారావు ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. సంస్థ ముఖ్య సంధానకర్త మంత్రి భుజంగరావుతో కలిసి బ్రహ్మానందంను సత్కరించారు. డాక్టర్ కె. ధర్మారావు మాట్లాడుతూ.. "వెయ్యికిపైగా చిత్రాల్లో నటించి గిన్నీస్ రికార్డు సృష్టించిన బ్రహ్మానందం తెలుగు సినిమా గౌరవాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లారు. పద్మశ్రీ పురస్కారం, గౌరవ డాక్టరేట్లు, ఐదుసార్లు ఉత్తమ హాస్య నటుడిగా, ఒకసారి ఉత్తమ సహాయ నటుడిగా నంది అవార్డులతో పాటు మరెన్నో జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్న అరుదైన నటుడు ఆయన. అటువంటి లెజెండరీ నటుడు 70వ వసంతంలోకి అడుగుపెడుతున్న తరుణంలో, వరుసగా 20వ సారి ఫాస్‌ఖి తరపున ఆయనను గౌరవించడం తమకు దక్కిన గొప్ప అదృష్టం" అని కొనియాడారు.



బ్రహ్మానందంను సత్కరిస్తున్న దృశ్యం

# పన్నుల రంగంలో 'క్రాస్ బోర్డర్ టాక్సేషన్' కీలకం

### ఎపి జీఎస్టీ అప్పీలేట్ ట్రిబ్యునల్ న్యాయసభ్యులు వేమిరెడ్డి భాస్కర్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త**

దేశంలోని పన్నుల రంగంలో క్రాస్ బోర్డర్ టాక్సేషన్ ఎంతో కీలకం అని ఏపీ జీఎస్టీ అప్పీలేట్ ట్రిబ్యునల్ న్యాయ సభ్యులు వేమిరెడ్డి భాస్కర్‌రెడ్డి చెప్పారు. సికింద్రాబాద్‌లోని ఒక హోటల్‌లో 'క్రాస్ బోర్డర్ టాక్సేషన్' అనే అంశంపై తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ స్పీకర్ మీట్ నిర్వహించింది. ఈ స్పీకర్ మీట్‌లో వేమిరెడ్డి భాస్కర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ దేశంలో సరిహద్దు లావాదేవీలను నియంత్రించే పన్ను చట్టాల సంక్లిష్టతల కారణంగా, విదేశాలలో వ్యాపారం చేయడం ఒక కష్టతరమైన, సవాలుతో కూడిన పని అని, అందువల్ల సంస్థలు తమ కార్యకలాపాలు నిర్వహించే వివిధ దేశాల పన్ను వాతావరణం, చట్టాల గురించి పూర్తి సమాచారాన్ని కలిగి ఉండటం చాలా ముఖ్యం అని అన్నారు. కాస్ బోర్డర్ టాక్సేషన్‌లో అంతర్జాతీయ నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకతతో స్థిరమైన పన్ను వ్యూహాలను నిర్మిస్తే విజయాలకు చేరువవుతారని తెలిపారు. జ్ఞాన ఆధారిత కార్యక్రమాలను నిర్వహిస్తూ పన్నుల రంగ నిపుణుల్లో నిరంతర వృత్తి అభివృద్ధిని ప్రోత్సహిస్తున్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ కృషిని ప్రశంసించారు. అలాగే, జీఎస్టీ అప్పీలేట్ ట్రిబ్యునల్ సజావుగా, సమర్థవంతంగా పనిచేయడానికి చార్టెడ్ అకౌంటెంట్లు, అడ్వొకేట్లు పరస్పరం సమన్వయంతో పనిచేయడం ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్ వేముల మాట్లాడుతూ వేమిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఏపీ ట్యాక్స్ బార్ సభ్యులు కావడం మనందరికి గర్వకారణం అని అన్నారు. ఈ నియామకం ఆయన అనుభవం, నిష్ఠ, పన్నుల రంగానికి చేసిన సేవలకు గుర్తింపుగా నిలుస్తుందని తెలిపారు. అలాగే, ఫిబ్రవరి 21న హైదరాబాద్, బిర్లా ప్లానెటేరియంలోని భాస్కర ఆడిటోరియంలో మూట్ ట్రిబ్యునల్ పోటీలు, ఫిబ్రవరి 5న యూనియన్ బడ్జెట్‌పై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. అంతేకాక, 18 సంవత్సరాల తర్వాత ట్యాక్స్ బార్ సభ్యుల డైరెక్టరీని విడుదల చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఇటీవలే ఆంధ్రప్రదేశ్ జీఎస్టీ అప్పీలేట్ ట్రిబ్యునల్ న్యాయ సభ్యుడిగా నియమితులైన వేమిరెడ్డి భాస్కర్‌రెడ్డిని శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని అసోసియేషన్ కార్యదర్శి ఆశిష్ జోషి సమన్వయం చేయగా, పూర్వ అధ్యక్షులు సిఏ హితేష్ జైన్, సలహాదారులు రామ్‌దేవ్ భుటాడా, అమృత్ కుమార్ కోట, ఉపాధ్యక్షులు నారాయణరావు, కార్యవర్గ సభ్యులు, గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు, పన్నుల రంగానికి చెందిన చార్టెడ్ అకౌంటెంట్లు, అడ్వొకేట్లు, ట్యాక్స్ ప్రాక్టీషనర్లు హాజరయ్యారు.



జీఎస్టీ అప్పీలేట్ ట్రిబ్యునల్ న్యాయ సభ్యుడు వేమిరెడ్డి భాస్కర్‌రెడ్డిని సన్మానిస్తున్న చంద్రశేఖర్ వేముల

## పర్యావరణ పరిక్షణపై అవగాహన

**సైఫాబాద్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** ప్రపంచ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో మేడారం మహాజాతర సమ్మక్క-సారాలమ్మ గద్దెల ప్రాంగణంలో పర్యావరణ పరిరక్షణపై భారీ అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఆ సంస్థ జాతీయ కార్యదర్శి సి.హెచ్.సాగర్, ములుగు జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్లాస్టిక్ నివారణ కోసం జ్యూట్, క్లాతుల బ్యాగ్‌లు పంపిణి కార్యక్రమాన్ని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్క, పర్యావరణ సంస్థ అధ్యక్షుడు డా.సి.హెచ్.భద్ర పాల్గొని ప్రారంభించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగంలో గుర్తింపు పొందిన 22 భాషాల్లో 'మేడారాన్ని కాపాడుకుందాం' అని రూపొందించిన ప్రత్యేక క్లాత్ బ్యానర్‌ను ప్రదర్శిస్తూ భక్తులకు ప్లాస్టిక్ వల్ల కలిగే అనార్థాలను వివరిస్తూ, జ్యూట్, క్లాత్ బ్యాగ్‌లను పంపిణి చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ తమ సంస్థ చేస్తున్న కృషిని అభినందించారు. అలాగే 22 భాషల్లో పర్యావరణ సందేశాన్ని ఇవ్వడం ద్వారా జాతీయ స్థాయిలో మేడారం విశిష్టతను చాటుతున్నారని, ఈ వన దేవతలను, ప్రకృతిని కాపాడుకుంటే భవిష్యత్తులో మేడారం 'ప్రపంచ వారసత్వ సాంస్కృతిక పండువ'గా గుర్తింపు పొందుతుందని మంత్రులు చెప్పారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సుమేర్, భరత్, అఖిల్, రాహుల్‌రెడ్డి తదతరులు పాల్గొన్నారు.

## బడ్జెట్‌ను స్వాగతిస్తున్నాం....

### తెలంగాణా రాష్ట్ర ఫెడరేషన్ ఆఫ్ ఛాంబర్స్ అండ్ ట్రేడ్ అధ్యక్షుడు ప్రకాష్

**బేగంపేట ఫిబ్రవరి 1, ప్రభాతవార్త :**

దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ప్రాధాన్యమిస్తూ కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ ను స్వాగతిస్తున్నామని తెలంగాణా రాష్ట్ర ఫెడరేషన్ ఆఫ్ ఛాంబర్స్ అండ్ ట్రేడ్ అధ్యక్షులు అమ్మనబోలు ప్రకాష్ అన్నారు. బడ్జెట్ అనం తరం ఆయన ప్యారడైజ్ సమీపంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేఖ రుల సమావేశంలో ప్రతినిధులు మోహన్ లాల్ జైన్, సంజయ్ పత్రిపాకలతో కల్సి మాట్లాడారు. దేశంలో 1.95 కోట్ల వ్యాపారులను మాత్రం ఈ బడ్జెట్ లో గతంలో మాదిరిగానే ఎంతో నిరాశ పర్చిందన్నారు. రైతులు, పారిశ్రామిక రంగానికి తదితర రంగాలకు ఇచ్చిన వెసులుబాటు, సబ్సిడీలు ఇచ్చి దేశాన్ని మిశ్రమాభివృద్దికి పీట వేశారని, వ్యాపారులకు మాత్రం ఎలాంటి ప్రోత్సహకాలు లేవన్నారు. 1.95కోట్ల వ్యాపారులతో పాటు సుమారు 8నుంచి 9కోట్ల మంది ఈ రంగంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి ఉన్నారని అన్నారు. జీఎస్టీ ఫైలింగ్‌లో చిన్న వ్యాపారులకు వచ్చే సమస్యలకు పరిష్కారం చూపలేదన్నారు. చిన్న వ్యాపారులకు వేరుగా పోర్టల్ పెట్టాల్సిన అవసరం ఉందని, చిన్న చిన్న మిస్‌మ్యాచ్ లాంటి సమస్యలు వస్తే జరిమానాలు, అధికారుల నుంచి ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. పెద్ద వ్యాపారులకు కన్సల్టెంట్లు, సలహా దారులు ఉంటారని, వారే అవన్నీ చూస్తారని, చిన్న వ్యాపారులకు అలా పెట్టుకుంటే ఆర్థిక భారం అవుతుందన్నారు. ఈ కామర్స్ వ్యాపారాలతో చిన్న, మధ్యతరగతి వ్యాపారాలు పూర్తిగా దెబ్బతిన్నాయని, అందుకే నియంత్రించేలా చట్టాలు తయారు చేయాలని ఆయన సూచించారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**నార్సింగి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :**

గండిపేట చెరువులో గుర్తు తెలియని పురుషుడి మృతదేహం లభించింది. ఈ సంఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్.ఐ మురళీధర్ తెలిపిన వివరాల ప్రకారం... ఖానాపూర్ శివారు ప్రాంతంలో ఉన్న గండిపేట్ చెరువులో ఓ వ్యక్తి శవం తేలియాడుతుందని స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న నార్సింగి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని నీటిలో నుంచి పురుషుడి మృతదేహంను వెలికి తీశారు. మృతుడు 50-60.సంవత్సరాల వయస్సు కలగి ఉంటాడని, ఆయన ఒంటిపై తెల్లటి షర్ట్, నీలంరంగు ప్యాంటు ధరించి ఉన్నాడని, ఇతడి సంబంధీకులు ఎవరైనా ఉంటే నేరుగా నార్సింగి పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. ఇతడు ప్రమాదవశాత్తు నీటిలో జారిపడ్డాడా? ఇతర ప్రాంతంలో పడిపోయి కొట్టుకు వచ్చాడా? మరేదైన కారణం ఉందా? అన్నది తేల్చేందుకు మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ మురళీధర్ తెలిపారు.

## ఉత్సాహంగా రన్ ఫర్ భారత్ మాత 5కే పరుగు

**నేరేడ్‌మెట్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :** రన్ ఫర్ భారత్ మాత బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన 5 కిలోమీటర్ల పరుగు సఫిల్‌గూడ మినీ ట్యాంక్ బండ్ చౌరస్తా నుంచి ఉత్సాహంగా ప్రారంభమైంది. కృపా కాంప్లెక్స్, పాత నేరేడ్‌మెట్, దేవీనగర్, సీతారామ్‌నగర్, సఫిల్‌గూడ, ఆనంద్‌బాగ్ ఎక్స్‌రోడ్డు మీదుగా ఈ పరుగు కొనసాగింది. జాతీయవాద భావాలతో పాల్గొన్న పలువురు దేశభక్తి నినాదాలు చేస్తూ పరుగు తీశారు. పరుగుకు ముందు రివైవ్ ఫిట్‌నెస్ సెంటర్ బృందం వార్మప్ సెషన్ నిర్వహించింది. వివిధ విభాగాల్లో జరిగిన పోటీల్లో బాల విభాగంలో అభిలాష్, వర్షిత్ రాజ్, బాలికల విభాగంలో స్వప్న శ్రీ, లక్ష్మీ ప్రసన్న విజేతలుగా నిలిచారు. తరుణ విభాగంలో అమర్‌కాంత్ సింగ్, ఆదర్శ్ రాజ్, శృతి, ప్రౌఢ విభాగంలో రాధిక అరుజున్, శ్రీనివాస్ గౌడ్, కల్పన, సాగరిక, 60 ఏళ్ల పైబడిన విభాగంలో రఘునాథ్ శర్మ, నళిని ప్రథమ స్థానాలు సాధించారు. అనంతరం జరిగిన సభలో ముఖ్య అతిథిగా కె.ఎల్.ఎన్. స్వామి, ముఖ్య వక్తగా మదన్ గుప్తా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మదన్‌గుప్తా యువత స్వామి వివేకానంద బోధనలను ఆదర్శంగా తీసుకుని దేశసేవలో ముందుండాలని, భారత్‌ను విశ్వగురువుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పోటీల్లో విజేతలైన వారికి పతకాలు అందజేశారు. కార్యక్రమం వందేమాతరం గీతం, భారత్ మాతపూజతో ఘనంగా ముగిసింది.

## విద్యార్థుల భవిష్యత్తుకు దిశానిర్దేశం...

**కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త :** ఇంటర్మీడియట్ తర్వాత విద్యార్థులకు అందుబాటులో ఉన్న వివిధ వృత్తిపరమైన అవకాశాలపై అవగాహన కల్పించేందుకు రెసొనెన్స్ జూనియర్ కళాశాలలు కూకట్‌పల్లిలోని జేఎన్టీయూ ఆడిటోరియంలో కెరీర్ క్లారిటీ కాన్క్లేవ్ అండ్ ఎక్స్‌పో 2026 నిర్వహించాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యార్థులు, తల్లిదండ్రుల కోసం ఐదు ప్రత్యేక సెషన్లు ప్రశ్నోత్తరాల సమయాన్ని ఏర్పాటు చేశారు. ప్రముఖ విద్యా సంస్థల నిపుణులు పరిశ్రమల ప్రతినిధులు విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ క్రింది అంశాలపై అవగాహన కల్పించారు. కెరీర్ మార్గాలు భవిష్యత్తులో ఎంచుకోవాల్సిన సరైన వృత్తి మార్గాలు, కోర్సుల ఎంపిక ఇంజనీరింగ్, మెడిసిన్, సైన్స్, టెక్నాలజీ, ఇతర అనుబంధ రంగాలలో కోర్సుల ప్రాధాన్యత, పోటీ పరీక్షలు వివిధ ప్రవేశ పరీక్షలకు సిద్ధమయ్యే విధానం, అడ్మిషన్ల అవగాహన ప్రీమియర్ విద్యాసంస్థల్లో ప్రవేశ ప్రక్రియలపై మాట్లాడారు. ప్రతి సెషన్‌లో ఒక ప్రధాన వక్త, ఇద్దరు ప్యానెల్ సభ్యులు వాస్తవ పరిస్థితిపై స్పష్టత ఇచ్చారు. ఈ సందర్భంగా ఐఐఐటీ డీన్ రమేష్ లోగనాథన్ మాట్లాడుతూ అభిరుచి, ప్రాథమిక అంశాల పట్ల ఉన్న అవగాహన ఆధారంగా కంప్యూటర్ సైన్స్‌ను ఎంచుకోవాలన్నారు. సమస్యలను పరిష్కరించే సామర్థ్యం అత్యంత కీలకంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా గీతం యూనివర్సిటీ కోర్ ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ రామశాస్త్రి వేదుల మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక సూత్రాలు అభ్యసించాలన్నారు. కోర్ ఇంజనీరింగ్ విభాగాల్లో అపారమైన అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా నెక్స్ట్‌వేవ్ కో ఫౌండర్ సీఈఓ రాహుల్ అత్తులూరి మాట్లాడుతూ భవిష్యత్తులో కెరీర్ నైపుణ్యాలకే ప్రాధాన్యత ఇస్తాయన్నారు. నిరంతరం అభ్యసన తప్పనిసరి అన్నారు.

పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా సామర్థ్యాలను మెరుగుపర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా యశోద హాస్పిటల్స్ డాక్టర్ బీ బాల రాజు మాట్లాడుతూ ఎంబీబీఎస్ దీర్ఘకాలిక నిబద్ధతతో కూడుకున్నదన్నారు. విద్యార్థులు బాధ్యతలు, వైద్య రంగానికి మించి ఉండే విభిన్న అవకాశాలను ముందుగా అర్థం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఐసీఎఫ్ఏఐ డైరెక్టర్ సుధాకర్ రావు మాట్లాడుతూ ఇంజనీరింగ్, మెడిసిన్‌కాకుండా ఇతర వృత్తిపరమైన అవకాశాలు వేగంగా పెరుగుతున్నాయని తెలిపారు. సరైన కెరీర్‌ను ఎంచుకోవడం, స్పష్టత, కమ్యూనికేషన్ స్కిల్స్‌పైనే విజయం ఆధారపడి ఉంటుందన్నారు.



కేంద్ర బడ్జెట్ వీక్షణ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి నాయకులు

## హైదరాబాద్ హై స్పీడ్ రైల్‌గా అభివృద్ధి

**హైదరాబాద్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** కేంద్ర బడ్జెట్‌లో హైదరాబాద్‌ను హై స్పీడ్ రైల్‌గా అభివృద్ధి చేస్తామని ప్రకటించడం చారిత్రాత్మక నిర్ణయమని, ఈ కీలక నిర్ణయం తీసుకున్న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బిజెపి హైదరాబాద్ సిటి ధన్యవాదాలు తెలిపింది. హైదరాబాద్-పుణే, హైదరాబాద్-బెంగుళూరు, హైదరాబాద్-చెన్నైల మధ్య ప్రతిపాదిత హైస్పీడ్ రైల్ కారిడార్ల అభివృద్ధితో హైదరాబాద్ దేశంలోని ఒక ప్రధాన రవాణ కేంద్రంగా అవతరించనున్నదని నగర శాఖ అధ్యక్షుడు లంకాల దీపక్‌రెడ్డి చెప్పారు. ఆదివారం బిజెపి నగర కార్యాలయంలో కేంద్ర బడ్జెట్ వీక్షణ కార్యక్రమం విజయవంతంగా జరిగిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 1000 కిలోమీటర్ల మేర హైస్పీడ్ రైల్ నెట్‌వర్క్ ఏర్పాటుకు 10,000 కోట్లకు పైగా వ్యయం చేయనున్నట్లు బడ్జెట్‌లో ఆర్థిక శాఖ మంత్రి ప్రకటించడం రాష్ట్ర అభివృద్ధికి గేమ్ చేంజర్‌గా మారుతుందన్నారు. ఈ ప్రాజెక్టుల వల్ల యువతకు ఉపాధి అవకాశాలు పెరగడమే కాకుండా పరిశ్రమలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కొత్త దారులు తెరుచుకుంటాయని, వికసిత్ భారత్ లక్ష్య సాధనలో హైదరాబాద్ కీలక పాత్ర పోషించనున్నదని ఆయన తెలిపారు.

## కెసిఆర్‌ను విచారణకు పిలవడంపై ఖండన

**చార్మినార్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :** బిఆర్ఎస్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష పూరిత రాజకీయాలకు పాల్పడుతున్నదని బహదూర్‌పుర నియోజకవర్గం, కిషన్‌బాగ్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు సాయి కిరణ్ అన్నారు. బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్‌ను ఆదివారం సిట్ పోలీసులు విచారించిన సందర్భంగా ముందు జాగ్రత్తగా బహదూర్‌పుర పోలీసులు కిషన్‌బాగ్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు సాయి కిరణ్‌ను అదుపులోకి తీసుకున్నారు. సాయంత్రం పోలీసులు సాయి కిరణ్‌ను విడిచి పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓడి పోతామని భయంతోనే సిటీ విచారణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం నాటకాలు ఆడుతుందోని తెలిపారు. బిఆర్ఎస్ అధినేత కేసిఆర్‌ను సిట్ విచారణకు పిలవటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామిలను అమలు చేయలేక డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని ఆయన తెలియజేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్‌పై సిట్ విచారణ రాజకీయ ప్రతీకారానికి అద్దం పడుతుందని, రానున్న ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పనున్నారని ఆయన తెలిపారు.

## కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక బడ్జెట్ : సిఐటియు

**ముషీరాబాద్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం తరపున ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక బడ్జెట్ అని సీఐటియూ నేతలు ఆరోపించారు. ఆదివారం సీఐటియూ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌ను నిరసిస్తూ బడ్జెట్‌ను ప్రజా అనుకూలంగా సవరించాలని డిమాండ్ చేస్తూ సీఐటియూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ బడ్జెట్ సబ్ కా సాత్, సబ్ కా కార్పోరేట్ వికాస్ బడ్జెట్‌లా ఉందని, ఈ బడ్జెట్‌లో సంపద సృష్టి కర్తల గురించి ఊసే లేదని విమర్శించారు. కార్పోరేట్‌లకు వేల కోట్ల రూపాయల ప్రాజెక్టులు కట్టబెట్టారని, కార్పోరేట్ పెట్టుబడులకు పన్నుల్లో స్థిరత్వం, రాయితీలు, సడలింపులు ప్రకటించారని ఆరోపించారు. కార్మికుల ఉద్యోగ భద్రత, ఉపాధి హామీపై ఒక్క మాట కూడా బడ్జెట్‌లో లేదని, ఈ బడ్జెట్‌తో కార్పోరేట్లు సంపదను పెంచుకునే అవకాశం కల్పించటమే కాకుండా కోట్లాది ప్రజల జీవన హక్కులను తాకట్టు పెటేటదిగా ఉందని ధ్వజమెత్తారు. సంస్కరణల పేరుతో ప్రైవేటీకరణను వేగవంతం చేసేందుకు పలు సంస్కరణలు ప్రవేశపెట్టారని, ఈ బడ్జెట్‌ను సంవరించాలని డిమాండ్ చేస్తూ పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో సీఐటియూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు, ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, నాయకులు ఎస్.వీరయ్య, జే.వెంకటేష్, కుమారస్వామి పాల్గొన్నారు.




ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటియూ నేతలు

# ప్రతిపక్షాల నిరసనలతో హోరెత్తిన పాతబస్తీ

### టిడిపి, బిఆర్ఎస్ ఆందోళనలు

**చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త :**

పాతబస్తీ టీడీపీ, బిఆర్ఎస్ పార్టీల నిరసనతో హోరెత్తింది. ఇరుపార్టీలు తమ నేతలపై ప్రతిపక్ష, పాలక పార్టీలు వ్యవహరిస్తున్న ధోరణిలకు వ్యతిరేకంగా ఆందోళనకు దిగాయి. కొంత కాలంగా ప్రతిపక్ష పార్టీల నిశబ్దత కొనసాగింది. ఆదివారం పాతనగరంలో ఒక్కసారిగా రాజకీయ వేడి రాజుకుంది. ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ నేత అంబటి రాంబాబు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా పాతబస్తీలోని తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు ఆదివారం పలు ప్రాంతాలలో నిరసన తెలిపారు. ఆయన ఫ్లెక్సీని చెప్పులతో కొడుతూ వైసీపీకి, అంబటికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. టీడీపీ హైదరాబాద్ పార్లమెంట్ కో ఆర్డినేటర్ నాగు నాగేష్ ఆధ్వర్యంలో లాల్ దర్వాజా మోడ్ వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అంబటి రాంబాబు బేషరతుగా క్షమాపణలు చెప్పాలన్నారు. లేదంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నేతలు తయ్యాబా తస్నీమ్, శ్యామ్ సుందర్, సల్లా రాజ్ కుమార్, బి.వై.శ్రీకాంత్, కె.జోగేందర్ సింగ్, అహ్మద్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



ఉప్పుగూడలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

**బిఆర్ఎస్ ఆధ్వర్యంలో...**

ఫోన్ ట్యాపింగ్ కేసులో తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును సిట్ విచారించటంపై ఆపార్టీ శ్రేణులు నిరసన ప్రదర్శనలు నిర్వహించాయి. ఉప్పుగూడలో ఆకుల శ్రీనివాస్, కందికల్ ఎస్ఆర్‌టీ కాలనీలో ఎం.సీతారాంరెడ్డి, ఫలక్‌నుమాలో ఎస్.గిరిధర్ నాయక్ తమ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, సిట్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఎం దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష్య పూరిత ధోరణి అవలంభిస్తుందని ఆరోపించారు. రాజకీయ ప్రతీకారంతోనే నోటీసులు ఇచ్చారన్నారు. కాగా స్థానిక పోలీసులు పలువురు బిఆర్ఎస్ నేతలను అదుపులోకి తీసుకొని ఆ తరువాత స్వంత పూచికత్తుపై విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు సరిత, శ్రీనివాస్, బ్రహ్మచారి, దర్శన్, సయ్యద్ కమాల్, రమేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

**వార్త VAARTHA CLASSIFIEDS**

**CHANGE OF NAME**

★ I Service No: 15422785P. Rank HAV. Name KANDYANA RAMESH NAIDU S/o Kandyana Simhachalam Serviced in 354 field hospital C/o: 56 APO Mehdipatnam. HYD-28 T.S. Changed my Mother Name From Ramudamma to **Kandyana Ramulamma.**

★ I Service No: 15422785P. Rank HAV. Name KANDYANA RAMESH NAIDU S/o Kandyana Simhachalam. Serviced in 354 field hospital C/o: 56 APO Mehdipatnam. HYD-28 T.S. Changed my Father Name From Simhachalam to **Kandyana Simhachalam.**

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

**IN THE COURT OF THE HON'BLE II ADDL. JUNIOR CIVIL JUDGE cum IX ADDL. JUDICIAL MAGISTRATE OF FIRST CLASS, MEDCHAL-MALKAJGIRI DISTRICT, AT: MEDCHAL**
**O.S.No. 19 OF 2026**

Between:
**Patancheru Anitha** & others ...Plaintiffs
**AND**
**Tahsildar,** Quthbullapur & another ...Defendants

**NOTICE**

To,
1. **The Tahsildar,** Quthbullapur
2. **All Concerned** ...Defendants

Please take notice that the abovenamed plaintiff has filed the above SUIT FOR DECLARATION OF LEGAL HEIRS against you in the II Addl. Junior Civil Judgecum IX ADDL. JUDICIAL MAGISTRATE OF FIRST CLASS, at Medchal. The Hon'ble Court has directed notice through paper publication against you.The above case stands posted on **02-03-2026.** If any person or persons are having any objection regarding to the below given suit schedule property in respect of the claim made by the plaintiff may appear before the said Hon'ble court at 10:30am. If failed to appear on that day, the matter will be heard and decided ex-parte.

**SCHEDULE OF PROPERTY:** All that the property H.No.16-36 (16-20 Old), with build up area of 500.0 Sq.Feet, ( R C C)., land admeasuring 200.0 Sq.Yards or equivalent to 167.2 Sq.Mtrs. in Suvey No.200, Situated at Rodamestrinagar-A, Gajularamaram Village, Quthbullapur Village, and Mandal, under GHMC Quthbullapur Circle, Medchal Makajgiri District, Telangana State, entire bounded by:- **North** : House No.16-35, **South** : Lane, **East**: 12-0' Wide Road, **West** : House No.16-271

**(By Order of the Hon'ble II ADDL. Junior Civil Judge, at Medchal)**
**D. Phanindar Rao**
**Janga Srikanth Yadav,**
**M.Sai Kiran Goud,** Advocate(s),
# 101, Ambika Nilayam, KLR Venture Road, Medchal, Hyderabad - 501 401.
**Ph.No. 8686863259**

**IN THE COURT OF THE HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE MEDCHAL-MALKAJGIRI DISTRICT, AT: MEDCHAL**
**OS. NO. 25 OF 2026**

BETWEEN:
1. **Police Sunitha Reddy,** W/o late Police Niranjan Reddy.
2. **Police Vinay Reddy,** S/o late Police Niranjan Reddy.
3. **Police Lokesh Reddy,** S/o late Police Niranjan Reddy.
All are R/o.Villa No.7, Mysquare Mortion Villas, Laxmi Nagar, Suraram, Quthbullapur Mandal, Medchal-Malkajgiri District, TS - 500055
...**PLAINTIFFS**
AND
**The Tahsildar, Quthbullapur Mandal & All concerned ...DEFENDANTS**

That the Plaintiffs herein filed the above suit seeking declaration to declare them as legal heirs of deceased Police Niranjan Reddy S/o Late Police Gopal Reddy who died on 15-12-2025 leaving the plaintiffs as his legal heirs. That the above suit i.e., O.S. No. 25 of 2026 is posted on **16-02-2026 at 10-30 A.M.** for the appearance of Defendants, and for objections if any before the Hon'ble Prl. Junior Civil Judge, Medchal-Malkajgiri District at Medchal. That in case there is no appearance or objections on **16-02-2026** before the above said court, the matter will be decided on merits.

(BY ORDER OF THE COURT)
**M/s. V. Vijay Reddy, (TS 1836/2007)**
**C. Hanumanthu**
**Advocates**
R/o. H.No.5-109/B, Bowrampet Village, Dundigal Gandimysamma Mandal, Medchal-Malkajgiri District, TS - 500043.
**Ph.9848382504**

**IN THE COURT OF THE HON'BLE XIX JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT HYDERABAD**
**O.S NO. 89 OF 2026**

BETWEEN:-
**Smt. Rajeshwari Agarwal and others ...Plaintiffs**
AND
**The Tahsildar and another ...Defendants**

To
**All Concerned**

**NOTICE**

Please take notice, the above named plaintiffs filed a SUIT FOR LEGAL HEIRS OF THE DECEASED Sri Rakesh Kumar Agarwal to be effected by the defendants. If anyone having any objection/Claim for grant of above relief may appear on **10-02-2026 at 10:30 am** before the said court, falling which the matter will be disposed off in accordance with law.

(BY ORDER OF THE COURT)
**D. Vishal Anand,**
**K. Surya Prakash.**
**Advocates**
2-2-147/A, First Floor, Above M.G Road, Secunderabad
**Cell: 9246102037**

**IN THE COURT OF CHIEF JUDGE, CITY CIVIL COURT, AT: HYDERABAD**
O.S.No. 23 OF 2026

Between :
1. **Smt . Praharaju Sravanthi**
W/o Praharaju Satya Rajashakar
D/o Loke Satyanarayana Rao
aged about 56 years, Occ :Household, R/o. Flat no. 1004, Misha Mansion, 4-12-013, Krishnapuri Colony, West Maredpally, Secunderabad-500026.
2. **Smt.Mahavadi Shailaja**
W/o. Mahavadi Manohar
D/o. Loke Satyanarayana Rao
aged about 60 years, Occ : Household, R/o. presently residing at 44001 laurel canyon Way, Fremont, CA 94539 . U.S.A.
3. **Smt. Loke Anitha**
W/o. Sri Avasarala Seshagiri Rao
D/o Loke Satyanarayana Rao
aged about 55 years, Occ : Household, R/o. 12 Mission Ridge Ct,Fremont, CA 94539 U.S.A.
4. **Sri. Loke Srinivas**
S/o. late Loke Satyanarayana Rao
aged about 51 years, Occ : Engineer
R/o. 1150 Hoskins Lane,San Ramon,CA 94582 U.S.A. ...*Plaintiffs*

AND
1. **Tahsildhar Amberpet Mandal** Rep. by its Officer, Police Quarter Police Colony, Amberpet, Hyderabad – 500 013
2. **All Concerned.** ...*Defendants*

To,
**ALL CONCERNED**

Please take notice that the above suit is filed by the Plaintiffs claiming for DECLARATION OF LEGAL HEIRS that the Plaintiffs are Legal Heirs of Late Loke Satyanarayana Rao and also to declare the Plaintiff as the successor-in-title in respect of Schedule Property, entitled to the same by the Law of Inheritance applicable under Hindu Succession Act. The above suit is posted to **20-2-2026** for appearance. If any person or persons having any objection in respect of the above said claim are hereby directed to appear either in person or through pleader with defense if any, at **10.30** am on the above said date i.e. **20-2-2026** before the above said Hon'ble Chief Judge Court, City Civil Court Hyderabad failing which the matter will be heard and determined exparte.

**SCHEDULE OF THE PROPERTY**

All that the Plot No. 1 admeasuring 515 Square Yards comprising of Ground and 1 floor with 4950 Square Feet of built up area forming part of land admeasuring 515 house bearing No. 16-2-701/7/B and 16-2-701/7/C Situated at Anand Nagar colony Malakpet, Hyderabad – 500036 bounded by
NORTH : 12 Feet Passage
SOUTH : Late Kanya Pershad's House
EAST : 30 Feet wide Road
WEST : B. Sudharshan Reddy House

*(BY THE ORDER OF THE HON'BLE COURT)*
**V.V. SIVAKUMAR,**
**B. SRIRAM REDDY, Advocates**
8-2-277/A Kingston Heights, 2nd Floor, Road No.2, Banjara Hills, Hyderabad–026
Counsel For Plaintiffs

## ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలి
### జస్టిస్ చంద్రకుమార్

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 1(ప్రభాతవార్త) :** తెలంగాణ ఉద్యమకారుల హక్కుల సాధన కోసం ప్రతిఒక్కరూ ఏకతాటిపైకి రావాలని విశ్రాంత హైకోర్ట్ న్యాయ మూర్తి జస్టిస్ చంద్రకుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం బాగ్ లింగం పల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఉద్యమ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కీలక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణ త్యాగాలు చేసిన, జైలుకు వెళ్లిన ఉద్యమకారుల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించడం సరికాదన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశానికి అధ్యక్షత వహించిన గోధుమల కుమారస్వామి పలు కీలక తీర్మానాలను ప్రవేశపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ రాబోయే రోజుల్లో పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఇందులో భాగంగా మంత్రుల నివాసాల ముందు దీక్షలు చేపట్టడం, ఇందిరా పార్క్ వద్ద భారీ ఎత్తున ఖిమహాధర్నాఖి నిర్వహించడం వంటి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. వీటికి సంబంధించిన తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాస్, కోతి మాధవి, గుండా యాదగిరి, పాండు గౌడ్, ముత్తయ్య, గుండమల్ల శ్రీనివాస్, ఆంబూ రాథోడ్, జానకి రెడ్డి, శ్యామల, ప్రభాకర్, దోలక్ యాదగిరి, సాయిబాబా, ముప్పిడి నర్సన్న, అయోధ్య రామయ్య, రాజు గౌడ్ తో పాటు 11 సంఘాల ప్రతినిధులు పాల్గొని తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

## రేణుక ఎల్లమ్మ ఆలయాన్ని దర్శించుకున్న బండారు దత్తాత్రేయ

**మెట్టుగూడ, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :** చిలకలగూడలోని మావురాల రేణుక ఎల్లమ్మ అమ్మవారిని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆదివారం బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి శారద మల్లేష్, బిజెపి సీనియర్ నాయకులు మల్లేష్ నాయకులు కార్యకర్తలతో కలిసి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా యు మల్లేష్ సరదా మల్లేష్ లను దత్తాత్రేయ శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం అన్న ప్రసాద వితరణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ బండ కార్తిక చంద్రారెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు భరత్ గౌడ్, దత్తాత్రేయ కూతురు విజయలక్ష్మి, మేకల సారంగపాణి, నాయకులు నాగేశ్వర్ రెడ్డి, ఆదర్శ్ ముదిరాజ్, కృష్ణమూర్తి, అనిత, బిక్షపతి, శ్రీనివాస్ చారి, నీలం శ్రీనివాస్ ముదిరాజ్, అంబాల రాజేశ్వరరావు కొన్నె సంపత్, మల్లి కంటి వీరన్న తో పాటు పలువురు పాల్గొన్నారు.

## రాజకీయ కక్షతోనే కెసిఆర్‌ను వేధిస్తున్న కాంగ్రెస్ సర్కార్
### బిఆర్ఎస్ శ్రేణులు

**నాచారం, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :** రాజకీయ కక్షతోనే మాజీ సీఎం కేసీఆర్‌ను కాంగ్రెస్‌ప్రభుత్వం వేదిస్తుందని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సాయ ఇజన్ శేఖర్ ఆరోపించారు. నందినగర్‌లోని కేసీఆర్ నివాసంలో సిట్ విచారణ నేపథ్యంలో ఆదివారం నాచారం హెచ్ఎంటీనగర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సాయిజన్ శేకర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ శ్రేణులు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాగ్రహాన్ని తప్పించుకునేందుకు డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. సిట్ విచారణల పేరిట తెలంగాణ ఉద్యమనేత, మాజీ సీఎం కేసీఆర్ ఆయన కుటుంబాన్ని వేదించడం కాంగ్రెస్ సర్కారు చేస్తున్న కుట్ర అన్నారు.పదేళ్ల పాలనలో తెలంగాణ రూపురేఖలు మార్చిన కేసీఆర్ పై ప్రభుత్వ వేదింపులను సిరసిస్తూ సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బారాస నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలు పాల్గొన్నారు

## జెప్మా నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

**జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త :** జూబ్లీహిల్స్ ప్రింట్ మీడియా అసోసియేషన్(జెప్మా) నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. రెండేళ్ల పదవీకాలానికిగాను ఈ ఎన్నికలను నిర్వహించారు. ఇందులో భాగంగా మెజార్టీ సభ్యులు కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ నూతన అధ్యక్షుడిగా బల్లు సతీష్, కార్యదర్శిగా గడేకారి సత్యనారాయణ, కోశాధికారిగా నరేంద్రుల అమర్‌గుప్తా, ఉపాధ్యక్షుడిగా గుండా సతీష్, కార్యనిర్వాహక కార్యదర్శిగా మహ్మద్ యాకుబ్, సంయుక్త కార్యదర్శిగా బి. దేవీప్రసాద్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కమిటీ పలు తీర్మానాలు చేసింది. మొత్తం 32 మంది సభ్యులకుగాను 22 మంది సభ్యులు ఈ సమావేశానికి హాజరయ్యారు. మెజార్టీ సభ్యులు కమిటీని ఆమోదించడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. జూబ్లీహిల్స్ జర్నలిస్టుల డిమాండ్ల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని నూతన కమిటీ నిర్ణయించింది. కాగా జెప్మా అధ్యక్షుడిగా బల్లు సతీష్ ఏకగ్రీవంగా ఎన్నికవ్వడం ఇది రెండోసారి. సమిష్టిగా తమ డిమాండ్లను సాధించుకుంటామని అధ్యక్షుడు వివరించారు.

## ఆకట్టుకున్న ప్రతిభాదర్శన్

**జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త :** చిన్నారుల్లో దాగి ఉండే సృజనాత్మకతను, కళలను వెలికితీయాలనే ఉద్దేశంతో జూబ్లీహిల్స్‌లోని జూబ్లీ హిల్స్ పబ్లిక్ స్కూల్(జేహెచ్‌పీఎస్)లో 'హమ్ హోంగే కామియాబ్' నినాదంతో ఏర్పాటుచేసిన ప్రతిబాదర్శన్ కార్యక్రమం ఆకట్టుకుంది. కమలాకుచ చూమక కుంకుమతో అనే స్వాగతనృత్యంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అయిదో తరగతి విద్యార్థులు పలు నృత్య, సంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ప్రాథమిక విభాగ ప్రధానోపాధ్యాయురాలు విధు మోహన్ మాట్లాడుతూ చిన్నారులకు ప్రాథమిక విద్యా సంవత్సరాలే జీవితానికి బలమైన పునాదులు అన్నారు. పిల్లలు ప్రశ్నించడం, భావాలను వ్యక్తపరచడం నేర్చుకుంటారన్నారు. ప్రిన్సిపల్ కాంచనవల్లి మాట్లాడుతూ విద్యార్థులకు బాల్యం అనేది ఎంతో మధురమైనదని, ఎన్నో జ్ఞాపకాలకు కేంద్రమైనదని అన్నారు. పాఠశాల ప్రసిడెంట్ మురళీముకుంద్ మాట్లాడుతూ చిన్నారుల ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి వేదికలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 12న జరిగే సమ్మెలో బిఎంఎస్ పాల్గోదు

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 1 (ప్రభాతవార్త) :** కొన్ని కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా రాజకీయ ప్రేరేపిత ఉద్దేశ్యాలతో పిలుపునిచ్చిన, ఫిబ్రవరి 12న జరగబోయే సార్వత్రిక సమ్మెకు భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) మద్దతు ఇవ్వబోమని సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ రెడ్డి, జిహెచ్ఎంసి బిఎంఎస్ ప్రధాన కార్యదర్శి టి.కృష్ణ, గ్రేటర్ అధ్యక్షుడు రాధాకృష్ణ స్పష్టం చేసారు. ఆదివారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీఎంఎస్ తన వైఖరిని స్థిరంగా చెబుతూ వస్తోంది, నాలుగు కార్మికకోడ్‌లలో రెండింటికి సంబంధించి తాను లేవనెత్తిన ఆందోళనలకు లోబడి, వాటిని స్వాగతిస్తుంది. వేతనాల కోడ్ మరియు సామాజిక భద్రతా కోడ్ చారిత్రాత్మకమైనవి అని, విప్లవాత్మకమైనవని బీఎంఎస్ స్పష్టంగా పేర్కొందని, అయితే దాని ఆందోళనలు మిగిలిన రెండు కోడ్‌లలోని కొన్ని నిబంధనలకు సంబంధించినవి. నవంబర్ 13 మరియు 21 తేదీలలో కేంద్ర కార్మిక మంత్రితో జరిగిన సమావేశాలలో ఈ సమస్యలను వివరంగా ప్రస్తావించడం జరిగిందన్నారు. ఈ సమావేశాలలో, బీఎంఎస్ లేవనెత్తిన ఆందోళనలను ప్రభుత్వం సముచితంగా పరిష్కరిస్తుందని సంబంధిత శాఖ మంత్రి బీఎంఎస్‌కు హామీ ఇచ్చారు. అదనంగా, వివిధ కార్మిక సంబంధిత సమస్యలపై బీఎంఎస్ ప్రభుత్వానికి అనేక ఇతర డిమాండ్లను కూడా సమర్పించింది. ఈ విషయాలను కూడా సముచితంగా పరిశీలించి, పరిష్కరిస్తామని కార్మిక మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు.

## కెసిఆర్‌పై సిట్ విచారణ కాంగ్రెస్ కుట్రలో భాగమే
### అందోలు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

**జోగిపేట, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త:** కేవలం కాంగ్రెస్ ప్రభుత్వంలో భాగంగనే కేసిఆర్‌పై కాంగ్రెస్ సిట్ విచారణ చేస్తుందని అందోలు బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆరోపించారు. ఆదివారంనాడు కేసిఆర్‌పై సిట్ విచారణను నిరసిస్తూ జోగిపేటలో నల్లజెండాలు, బ్యాడ్జీలతో బైక్ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. అందోలు నుంచి జోగిపేటలోని ప్రధాన వీధులగుండా ర్యాలీ నిర్వహించి, బసవేశ్వర చౌరస్తా వద్దకు చేరుకున్నారు. ర్యాలీ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరన్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచికూడా బిఆర్ఎస్ నాయకులపై బురదజల్లే ప్రయత్నం, బిఆర్ఎస్ అధినాయకులపై కుట్రపూరితంగా కేసులు పెట్టే ప్రయత్నమే చేస్తున్నారేతప్ప, ప్రజాసంక్షేమాన్ని ఏమాత్రం పట్టించుకోవటంలేదని విమర్శించారు. కేసిఆర్ ఒక వ్యక్తి కాదని, ఆయన ఒక శక్తి అని, ఆయన చేసిన అలుపెరగని పోరాటంతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని పేర్కొన్నారు. అలాంటి వ్యక్తి మీద కేసులు పెట్టినంతమాత్రాన ఝుంకే పరిస్థితి లేదని తెలిపారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కుట్రలు, కుతంత్రాలు మానుకొని ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చటంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు సార శ్రీధర్, పట్లూరి శివశేఖర్ పాల్గొన్నారు.

# అమరవీరుల స్తూపం సాక్షిగా అబద్ధాలు

## పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్
### సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి



.మాట్లాడుతున్న అత్తు ఇమామ్

సిద్ధిపేట అమరవీరుల స్తూపం సాక్షి గా బీఆర్ఎస్ పార్టీ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా అబద్ధాలు మాట్లాడారని కాంగ్రెస్ పార్టీ సిద్ధిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ ఆరోపించారు.ఆదివారం సిద్ధిపేటలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అమరవీరుల స్తూపానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ మాజీ ఐపీఎస్ అధికారి అయిన ప్రవీణ్ కుమార్ బీఎస్పీ పార్టీలో ఉన్నప్పుడు కేసీఆర్ అవినీతి చేశాడని మాట్లాడలేదా అని ప్రశ్నించారు. బీఎస్పీలో ఉన్నప్పుడు కేసీఆర్‌ను దళిత వ్యతిరేకిగా చిత్రీకరించి ఆయనపై పోరాటం చేస్తానని, ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీలో చేరి తన నమ్మిన సిద్ధాంతాలను వదిలేశారని విమర్శించారు. అప్పట్లో అవినీతి చేశాడని చెప్పి, బీఆర్ఎస్‌లో చేరగానే కేసీఆర్ ఏ తప్పు చేయలేదని చెప్పడం సిగ్గుచేటన్నారు.తెలంగాణ ఎవరి సొత్తు కాదని, అధికారం ఎవరికివ్వాలో తెలంగాణ ప్రజలే నిర్ణయిస్తారని స్పష్టం చేశారు. కేసీఆర్‌ను నమ్మి ప్రజలు పదేళ్లపాటు అధికారాన్ని అప్పగిస్తే లక్షల కోట్ల అవినీతి చేశారని ఆరోపించారు.

తీవ్రవాదం దేశ రక్షణ కోసమే టెలిగ్రాఫ్ చట్టం తీసుకువచ్చారని, కానీ ఇష్టం వచ్చిన వారి కుటుంబ సభ్యుల ఫోన్లు వినేందుకు ఆ చట్టం అనుమతించదన్నారు. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన పక్కా ఆధారాలు ఉన్నాయని, అందుకే నేరం చేసిన వారికే అధికారులు నోటీసులు ఇచ్చి విచారణ చేస్తున్నారన్నారు. తప్పు చేసిన వారు తప్పకుండా జైలుకు వెళ్లడం ఖాయమని హెచ్చరించారు.

తెలంగాణ ప్రజల పక్షాన నిలబడాల్సిన ప్రవీణ్ కుమార్ ఇకనైనా కేసీఆర్ జపం మానుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కక్ష యపూరితంగా వ్యవహరించడం లేదని, అనవసరంగా సీఎం రేవంత్ రెడ్డిని విమర్శించడం మానుకోవాలన్నారు. మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రులు, ముఖ్యమంత్రిపై విమర్శలు చేస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.గ్యాదారి మధు, గాయాజుద్దీన్, హర్షద్, విజయ్, డానియల్, బాబా అజర్, రవితేజ, విశాల్, ప్రాషీ, అర్జున్ పాల్గొన్నారు.

## బాలుర వసతి గృహానికి దుప్పట్లు పంపిణీ


వసతి గృహంలో దుప్పట్లు పంపిణీ చేసన్న దృశ్యం

**గుమ్మడిదల ఫిబ్రవరి1 ప్రభాతవార్త** :పేద విద్యార్థుల జీవితాల్లో చిరునవ్వులు పూయించాలనే ఉద్దేశంతో న్యూల్యాండ్ ఫార్మా పరిశ్రమ ముందుకొచ్చింది. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో న్యూలాండ్ ఫార్మా పరిశ్రమ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ కార్యక్రమం హృదయాన్ని తాకే విధంగా నిర్వహించారు.చలికాలంలో వసతి గృహంలో నివసిస్తూ చదువుకుంటున్న విద్యార్థులకు అవసరమైన దుప్పట్లు అందజేసి, సంస్థ ప్రతినిధులు మానవత్వానికి అద్దం పట్టారు. చిన్న సహాయమే అయినా అది పిల్లల భవిష్యత్తుకు పెద్ద అండగా మారుతుందనే భావనను ఈ కార్యక్రమం స్పష్టంగా చూపించింది.ఈ కార్యక్రమంలో న్యూల్యాండ్ ఫార్మా కంపెనీ ప్రతినిధులు గౌతం, నర్సింలు, ప్రశాంత్ పాల్గొని విద్యార్థులతో ఆత్మీయంగా మమేకమయ్యారు. చదువు అనేది పిల్లల ఆయుధమని, సమాజంలో నిలదొక్కుకునేందుకు విద్యే బలమని తెలిపారు. తమ వంతుగా విద్యార్థులకు ఎప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు.వసతి గృహ సంక్షేమాధికారి రవితేజ మాట్లాడుతూ, పేద కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థుల అవసరాలను గుర్తించి న్యూల్యాండ్ ఫార్మా పరిశ్రమ ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచి, వారి చదువుకు మరింత ప్రోత్సాహాన్ని ఇస్తాయని పేర్కొన్నారు. వసతి గృహ సిబ్బంది, విద్యార్థులు పాల్గొని న్యూలాండ్ ఫార్మా సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.

## సిట్ విచారణకు పిలవడం పట్ల బిఆర్ఎస్ ఆందోళన


సదాశివపేటలో నిరసన వ్యక్తం చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

**సదాశివపేట,ఫిబ్రవరి 1 (ప్రభాతవార్త):** సిట్ విచారణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం శనివారం మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కు నోటీసులు విచారణ పేరుతో అందచేశారు.దానికి వ్యతిరేకంగా రాష్ట్ర బిఆర్ఎస్ పార్టీ పిలుపుమేరకు విచారణ వ్యతిరేకిస్తూ సంగారెడ్డి శాసనసభ్యులు చింత ప్రభాకర్ ఆదేశానుసరం సదాశివపేట, వెల్టూర్ లలో కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కి వ్యతిరేకంగా నిరసన తెలియచేశారు. ఈ గత రెండు సంవత్సరాలనుండి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ మాజీ మంత్రులను రాష్ట్ర నాయకులు విచారణ పేరుతో ఇబ్బందులకు గురి చేస్తూ కేసీఆర్ కి నోటీసులు పంపించి విచారణకు రమ్మనడం హేయమైన చర్య అని ఖండించారు.మున్ముందు ఇలాగేచేస్తే ఊరుకునేది లేదని కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని తీవ్రంగావాచ్చరించారో మాజీ ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ మఠం బిక్షపతి,రాష్ట్ర నాయకులు చింతాసాయినాథ్,చీల మల్లన్న,అంజయ్య, మాజీ సర్పంచులు, వార్డు మెంబర్లు, బిఆర్ఎస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



## కెసిఅర్‌ను విచారణకు పిలవడంతో మిన్నంటిన నిరసనలు

**కొండపాక, జనవరి 1, ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్ర సాధకుడు మాజీ ముఖ్యమంత్రి కేసీఅర్‌కు ఎస్ఐటి నోటీస్ ఇచ్చి విచారణకు పిలవడంతో బిఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు అదివారం కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లోని అన్ని గ్రామాల్లో వివిధ రకాలుగా బిఆర్ఎస్ నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. లకుదారం, మంగోల్ గ్రామాల బిఆర్ఎస్ నాయకులు ఎర్రవల్లిలోని కెసిఅర్ పామ్ హౌజ్ వరకు బైకు ర్యాలీతో వెల్లి అయనకు మద్దతు తెలిపారు. కుకునూరుపల్లిలో బస్‌స్టాండ్ వద్ద కుకునూరుపల్లి, తిప్పారం, ముద్దపూర్, చిన్నకిష్టాపూర్, మాత్‌పల్లి, కోనాయిపల్లి, మేదినిపూర్ పిటి వెంకటపూర్, రాయవరం,బొబ్బాయిపల్లిగ్రామాలకుచెందిననాయకులు, కార్యకర్తలు నల్ల బ్యాడ్జిలు ధరించి కొంత సేపు రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమాల్లో నాయకులు దేవి రవీందర్, కిరణ్‌కుమార్, బచ్చలి మహిపాల్, కొల సద్గుణ, అమర్, కొల రవీందర్, కర్ణాకర్, రాజు, నర్సింలు, నాగరాజుతదితరులుపాల్గొన్నారు. కొండపాక మండలంలోని మర్పడ్గ, ఖమ్మంపల్లి, బందారం, విశ్వానాథ్‌పల్లి, దుద్దెడ, అంకిరెడ్డిపల్లి గ్రామాల్లో సిఎం రేవంత్‌రెడ్డ దిష్టి బొమ్మను దగ్దం చేసి నిరసన వ్యక్తం చేశారు. జిర్ర రాజు, రాజిరెడ్డి, దుర్గయ్య, చంద్రశేఖర్, కుమార్, శ్రీనివాస్, భాను తదితరులు పాల్గొన్నారు

## యాప్ ద్వారా యూరియా బుకింగ్
### మండల వ్యవసాయ అధికారి వేల్పుల పూజ

**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త**

హుస్నాబాద్ మండలంలోనిరైతులుసోమవారంనుంచి యూరియాను తప్పనిసరిగా ఫర్టిలైజర్ యాప్ ద్వార మాత్రమే యూరియా బుకింగ్ చేసుకుని తర్వాతే కొనుగోలు చేయాలని మండల వ్యవసాయ అధికారిణి వేల్పుల పూజ ఒక ప్రకటనలో తెలిపారు.రైతులు నేరుగా ఫర్టిలైజర్ దుకాణాలకు వెళ్తే యూరియా పంపిణీ చేయబడదని స్పష్టం చేశారు. యాప్ ద్వారా బుకింగ్ చేసే సమయంలో మండలంలోని ఏఏఫర్టిలైజర్ షాప్‌లలో యూరియా అందుబాటులో ఉందో యాప్‌లో స్పష్టంగా కనిపిస్తుందని తెలిపారు. అందులో రైతులు తమకు అనుకూలమైన ఫర్టిలైజర్ షాప్‌ను ఎంచుకొని యూరియానుబుక్‌చేసుకోవచ్చన్నారు. యూరియాబుకింగ్ పూర్తయ్యాక రైతులకు ఒక ప్రత్యేక ఐడీ (బుకింగ్ ఐడీ) జనరేట్ అవుతుందని, ఆ ఐడీ ద్వారానే యూరియా కొనుగోలు చేయాల్సి ఉంటుందని వెల్లడించారు.బుకింగ్ సమయంలో రైతులకు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే తమ క్లస్టర్ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతులు ఈ విధానాన్ని తప్పనిసరిగా పాటించి, అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.

## మహా శివుడికి ఘనంగా పూజలు

**నదాశివపేట, ఫిబ్రవరి1(ప్రభాతవార్త):** రాచన్నగురుస్వామి ఆధ్వర్యంలోని50 మంది శివ స్వాముల బృందం శివనామస్మరణలు వేదమంత్రాలు పటిస్తుండగా సురేష్ స్వామి దంపతులు కుటుంబ సభ్యులు ఆ పరమేశ్వరుడు దివి నుండి భువికి దిగివచ్చేలా ఘనంగా పూజలు అభిషేకాలు నిర్వహించారు. శివ స్వాములు భక్తుల హోరాహోరిగా శివపంచాక్షరి,భజనలతోపరిసరాలు దద్దరిల్లాయి. స్వామివారికి మంగళ హారతులు అనంతరం వచ్చిన భక్తులకు అన్నదానప్రసాదంగావించారు. రాచన్నగురుస్వామి, టైలర్ శ్రీనివాస్,మధునాల నర్సింలు, కార్పెంటర్ రాజు, గంగారం,వెల్డింగ్ రాజు, ఏంఆర్ఎఫ్ రమేష్, బాల్రాజ్, ల్యాబ్ సంగమేశ్వర్, ఆటో శంకర్, ఫోటో మల్లేశం, సురేష్,నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్‌ను సిట్ విచారణ చేయడంపై బిఆర్ఎస్ నిరసన


మునిపల్లి చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

**మునిపల్లి,ఫిబ్రవరి 1 (ప్రభాతవార్త):**

కెసిఆర్‌పై సిట్ వాచారణ చేపట్టడం పట్ల మునిపల్లి మండల బిఆర్ఎస్ నాయకులు నిరసన చేపట్టారు.మండలంలోని మునిపల్లి చౌరస్తాలోని అబేద్కర్ వగ్రహం వద్ద కాంగ్రెస్ ప్రభుత్వంకు వ్యతిరేకంగా ధర్నా చేపట్టారు.ప్రజలకు అమలు కాని హామీలు ఇచ్చి నిండా ముంచిన రేవంత్ సర్కార్ అడ్డగోలు అవినీతికి పాల్పడుతూ తమ బండారం బయటపడుతుందని ఉద్దేశంతోనే కెసిఆర్ పై బురదజల్లే ప్రయత్నం చేస్తుందని వారు ఆరోపించారు.తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు,పాలనా లోపాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు, ఇప్పుడు విచారణల పేరుతోకేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం అత్యంత దుర్మార్గమన్నారు.పదేళ్ల పాలనలో అనేక ప్రజా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల మన్ననలు పొందిన కేసీఆర్ ను తప్పుడు కేసులతో, బెదిరింపులతో ప్రజల గుండెల్లో నుంచి తొలగించలేరని స్పష్టం చేశారు.

కేసీఆర్‌పై కేసులు, విచారణల పేరుతో ఇబ్బంది పెట్టి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాక్షసానందం పొందుతున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ గుండెల్లో పదిలమైన స్థానం సంపాదించుకున్న కేసీఆర్ ను ఇబ్బందులకు గురిచేస్తే తెలంగాణ ప్రజానీకం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ పై చేస్తున్న అరాచకాలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారన్నారు.

ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి,న్యాయవాది మంతూరి శశికుమార్,సాయికుమార్,డాక్టర్ సుల్తాన్,సర్పంచులు మల్లేశం, రమేష్,సంగమేశ్వర్,మండల నాయకులు మౌలానా,శేఖర్, కుతుబోద్దీన్, బక్కన్న, దుర్గయ్య,మల్లేశం, రాజు,మాణయ్య, న్సిములు, బస్వరాజ్ ,ఆనంద్, జంషీద్, ఖదీర్, అప్సర్,మొగులయ్య, నగేష్,శంకర్, విఠల్, అక్బర్,సరేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ గాయకుడు త్రినాథ్ రావుకు సత్కారం

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 1 (ప్రభాతవార్త) :** అసోసియేషన్ ఆఫ్ ఇండో అమెరికన్స్, బే ఏరియా తెలుగు అసోసియేషన్ సంయుక్తంగా ఆదివారం ఏఐఎ ఐడల్ పేరిట నిర్వహించిన పాటల పోటీల్లో చిక్కడపల్లికి చెందిన ప్రముఖ అంతర్జాతీయ గాయకుడు, శారదా వరపుత్ర డా. త్రినాధరావు విజేతగా నిలిచారు. పోటీలు హిందుస్థానీ క్లాసికల్, బాలీవుడ్ సాంగ్స్ విభాగాల్లో జూనియర్స్, సీనియర్స్ కు వేరు వేరుగా నిర్వహింపబడగా, త్రినాధరావు బాలీవుడ్ సీనియర్స్ విభాగంలో గెలుపొందారు. ఈ సందర్భంగా నిర్వహింపబడిన సభకు కాన్సోలేట్ జనరల్ శ్రీకర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి, ప్రసంగించారు. త్రినాధరావు మాట్లాడుతూ, హిందీ పాటల పోటీల్లో పాల్గొనడం ఇదే ప్రథమమని, ఈ గెలుపు ఇచ్చిన స్ఫూర్తితో ఇకముందు హిందీ పాటలు కూడా ఎక్కువగా పాడడానికి కృషి చేస్తానని తెలియజేశారు. నిర్వాహకులు మంగిన ప్రసాద్ మాట్లాడుతూ, త్రినాధరావు హిందీ పాటలు కూడా అద్భుతంగా పాడగలరని నిరూపించారన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలనుండి, గాయనీగాయకులు పోటీల్లో పాల్గొన్నారు. పాటల పోటీల అనంతరం ప్రవాస భారతీయ కళాకారులు సంక్రాంతి, రిపబ్లిక్ డే సందర్భంగా తమ నాట్య ప్రదర్శనలతో, అసంఖ్యాక ప్రేక్షకులను అలరించారు.

## అధ్యాపకుల మార్గదర్శనం వల్లే ఉత్తమ ఫలితాలు

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 1 (ప్రభాతవార్త) :** విద్యార్థుల కఠిన సాధన, అనుభవజ్ఞులైన అధ్యాపకుల మార్గదర్శనం మంచి ఫలితాలు సాధించడం జరుగుతుందని ప్రముఖ ఐఏఎస్ విద్యాసంస్థ ఆర్.సి. రెడ్డి ఐటీఈ స్టడీ సర్కిల్ నిర్వాహకులు వెల్లడించారు. ఆదివారం అశోక్ నగర్ స్టడీ సర్కిల్ కేంద్రం లో ఉత్తమ ఫలితాలు సాధించిన వారిని సత్కరించారు. 40 సంవత్సరాల సుదీర్ఘ విజయ పరంపరతో దక్షి ణ భారతదేశంలోనే ప్రఖ్యాత పోటీ పరీక్షల శిక్షణ సంస్థగా నిలిచిందని, ఇటీవల ప్రకటించిన ఏపీ గ్రూప్1 ఫలితాల్లో మొత్తం విజేతల్లో 50 శాతం మంది తమ సంస్థ విద్యార్థులే కావడం విశేషమన్నారు. అంతేకాకుండా, గతంలో గ్రూప్2 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో అత్యధిక ర్యాంకులను సాధించి, నిరంతర విజయాలతో ముందుకు సాగుతోంది. ఇప్పుడు గ్రూప్1 ఫలితాల్లో కూడా అదే విజయ పరంపరను కొనసాగించడం సంస్థకు గర్వకారణంగా నిలిచిందన్నారు.

### పేరి నాగేశ్వర రావు రచించిన
## "సమాజ దర్పణం" పుస్తకావిష్కరణ

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 1 (ప్రభాతవార్త) :** శ్రీద్యుతి మ్యూజికల్ అకాడమీ ఇషాన్ ఫౌండేషన్ విజయ్ క్రియేషన్స్ సాంస్కృతిక సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం చిక్కడపల్లిలోని త్యాగరాయ గాన సభ లోని కళా సుబ్బారావు వేదికలో సామాజిక విశ్లేషకుడు, పేరి నాగేశ్వర రావు రచించిన "సమాజ దర్పణం" పుస్తకావిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా వంశీ సంస్థల అధినేత, కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. గౌరవ అతిథిగా నంది అవార్డ్ గ్రహీత చిమ్మపూడి శ్రీరామ మూర్తి , త్యాగరాయగానసభ అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్ధన మూర్తి తదితరులు పాల్గొన్నారు. పేరి నాగేశ్వర రావు అధ్యక్షతన జరిగిన ఈ సభకు నిర్వాహక సంస్థ కార్యదర్శి, గాయని పేరి విజయలక్ష్మి మ్మ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎ. సింధుజ ప్రదర్శించిన భరతనాట్యం సభికులను విశేషంగా అలరించింది. ఈ కార్యక్రమంలో ఆత్మీయ అతిథులుగా పేరి లక్ష్మీ మ్మ నరసింహం, వి. హరి శ్రీనివాస్, పేరి కామేశ్వర రావు, డాక్టర్ సి.యం.ఎ. దుర్గా ప్రసాద్, కర్రా శ్రీరామమూర్తి , పి.వి రమణ మూర్తి, శ్రీధర్ శ్రీహాన్ పాల్గొన్నారు.

## కార్మికులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
### భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముత్యాల సత్యనారాయణ

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 1 (ప్రభాతవార్త) :** కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు అసంఘటిత రంగ కార్మికుల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రతి కార్మికుడు వినియోగించుకోవాలని తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముత్యాల సత్యనారాయణ కోరారు. ఆదివారం చిక్కడపల్లి, బాగ్ లింగంపల్లి తదితర ప్రాంతాలలో కార్మికుల అడ్డాల వద్ద ఈశ్రమ్ కార్డుల పంపిణీ కార్యక్రమం తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముత్యాల సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై కార్మికులకు కార్డులను అందజేశారు. ప్రసంగిస్తూ ఈశ్రమ్ కార్డు ద్వారా దేశవ్యాప్తంగా సామాజిక భద్రత, ప్రమాద బీమా వంటి ప్రయోజనాలు పొందవచ్చని వివరించారు. కార్మికులు తమ హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు మధుసూదన్, గంగాధర్, రాంచందర్, నిరంజన్, నరసింహ, సుజాత, లక్ష్మి మ్మ, అనురాధ, బాయమ్మ, సుశీల, మంగ తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.

## తెలంగాణ రాష్ట్ర సాధకుడిని విచారణ చేపట్టటం దారుణం
### బీఆర్ఎస్ నేత ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, రాంనగర్ మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి

ముషీరాబాద్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర సాధకునికి సిట్ నోటీసులు జారీ చేయటం, విచారణ పేరుతో ఇబ్బదులకు గురిచేయటం దారుణమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, రాంనగర్ మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాసరెడ్డిలు అన్నారు. ఆదివారం బీఆర్ఎస్ తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులు, ముషీరాబాద్ నియోజకవర్గం ఆధ్వర్యంలో ఇందిరాపార్కు చౌరస్తాలో నిరసన చేపట్టి, అనంతరం బండమైసమ్మ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ మీద కక్ష సాధించటానికే సీఎం రేవంత్‌రెడ్డి సిట్ ద్వారా నోటీసులు జారీ చేయించారని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎలాంటి ఆధారాలు లేవని, కేవలం రాజకీయ లబ్ధి కోసమే రేవంత్‌రెడ్డి ఫోన్ ట్యాపింగ్ కేసీఆరన, కేటీఆర్, హరీష్‌రావులకు నోటీసులు ఇచ్చారని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికలలో బీఆర్ఎస్ భారీ మెజార్టీ సీట్లు గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు రేషం మల్లేష్, సిరిగిరి శ్యాం, కల్వగోపి, భిక్షపతి యాదవ్, నేతా శ్రీనివాస్, అజయ్ ముదిరాజ్, చిట్టి, ముదారి పురుషోత్తం, సాయినాథ్, సదాబాబు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా తెలుగు వెలుగు సమాఖ్య 17వ సమావేశ కార్యక్రమాలు

**నాంపల్లి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :** అవధాన ప్రక్రియ కేవలం తెలుగుజాతి కళాత్మక తరగని సంపదని విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అన్నారు. ఈ ప్రక్రియలో యువతను ప్రోత్సహించడం, తదనుగుణంగా వారూ ముందుకురావడం ముదావహం అని నేటి యువ అవధాని, తెలుగు విశ్వవిద్యాలయ కీర్తి పురస్కార గ్రహీత అవుసుల భానుప్రకాశ్‌ను అభినందించారు. కర్మనిష్ట, సమయపాలన, క్రమశిక్షణ ప్రతీఒక్కరూ అలవరచుకొని ప్రగతిపథంలో పయనించాలని హితవుపలికారు. యువభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ, సాహితీ జిగీష సంయుక్త ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయంలోని రావిచెట్టు రంగారావు కళామందిరంలో ఆచార్య వంగపల్లి విశ్వనాథం సభాధ్యక్షతన తెలుగు వెలుగు సమాఖ్య 17వ సమావేశంలో ఆధునిక కవిత్వం-అభ్యుదయ దృక్కోణం అనే అంశంపై ఆచార్య పి.వి.ఉమాశశి ప్రసంగం, సుప్రసిద్ధ అవధాని అవుసుల భానుప్రకాశ్ అష్టావధానం కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా హాజరైన డా. కె.వి.రమణాచారి ఆత్మీయ అతిథులు డా. ఆచార్య ఫణీంద్ర, డా. పి.లలితవాణి, సాధన నరసింహాచార్య, కెవిఎన్.ఆచార్య, రామచంద్రరావు తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనంచేసి మాట్లాడారు. అనంతరం జరిగిన అవుసుల భానుప్రకాశ్ అష్టావధానంలో పృచ్ఛకులుగా ఆచార్య ఫణీంద్ర, పోతరాజు, కౌండిన్యతిలక్, నరసింహాచార్య, స్వామిప్రసాదం, పి.లలితవాణి, కెవిఎన్.ఆచార్య, తిరునగరి శరత్‌చంద్రలు వారివారి అంశాలపై ప్రశ్నలు సంధించారు. చివరిగా భానుప్రకాశ్ అష్టావధానం విజయవంతంగా ముగిసింది. అతిథుల చేతులమీదుగా ఆయన్ను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

### విచారణ పేరుతో
## మాజీ సిఎం కెసిఆర్‌పై రాజకీయ వేధింపులు

**అత్తాపూర్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :** మాజీ సిఎం, బిఆర్ఎస్ అధినేత కేసిఆర్‌ను సిట్ విచారణ పేరుతో రాజకీయ వేధింపులకు పాల్పడుతుందని రాజేంద్రనగర్ కార్పొరేటర్ అర్చన జయప్రకాష్ అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆదివారం బిఆర్ఎస్ నాయకులు ఆరంఘర్ రోడ్డు మార్గంలో ఆయన దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా అర్చన జయప్రకాష్ మాట్లాడుతూ చరిత్ర సృష్టి కర్తల జోలికి వస్తే చివరికి చరిత్ర హీనులుగా మిగిలి పోవడం ఖాయమని,కర్మ ఎవరిని వదిలి పెట్టదని తెలిపారు.కేసిఆర్‌పై నేడు కేవలం రాజకీయ కక్షతో,తలాతోక లేని కేసులు పెట్టి విచారణల పేరుతో ఆయన స్థాయిని తగ్గించాలని ప్రయత్నిస్తున్నారని ఆమె తెలియజేశారు. నిరసన కార్యకమంలో బిఆర్ఎస్ నాయకులు జయప్రకాష్, రజనీకాంత్‌గౌడ్, సదాల వెంకట్‌రెడ్డి, సాయిగౌడ్, బద్దం శ్రీ కాంత్‌రెడ్డి, బానాల నరేందర్, జీవన్‌దాసు, సదాల శ్రీనివాస్‌రెడ్డి, సూర్యం, సూర్య ప్రకాష్ రెడ్డి,జగన్,శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సామవేదంకు వంశీరమణాచారి జాతీయ పురస్కారం

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 1(ప్రభాతవార్త):** ఈ నెల 4 వ తేదీన శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై వంశీ ఇంటర్నేషనల్ ఆఫ్ ఇండియా నిర్వాహణలో ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె వి రమణాచారి జన్మ దినోత్సవ సందర్భంగా ప్రఖ్యాత అధ్యాత్మిక ప్రవచన కర్త సామవేదం షణ్ముఖ శర్మ కు వంశీ రమణాచారి జాతీయ పురస్కారం ప్రదానం చేయనున్నట్లు వంశీ సంస్థల అధినేత, కళా బ్రహ్మ వంశీ రామరాజు విలేకరులకు తెలిపారు పుష్పగిరి పీఠం విద్యా శంకర భారతీ స్వామి సమక్షం లో జరిగే ఈ కార్యక్రమము కి ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం అధ్యక్షత వహించగా నట దర్శక రచయిత తనికెళ్ల భరణి కిమ్స్ ఫౌండర్ బొల్లినేని కృష్ణయ్య దర్శకుడు రేలంగి నరసింహారావు తదితరులు పాల్గొంటారు సామవేదం షణ్ముఖ శర్మ ప్రసంగం తో పాటు వై ఎస్ రామకృష్ణ బృందం సినీ గీత